


# విజయభాను





విశాఖపట్నం, గురువారం 10-05-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 232 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## కాంగ్రెస్‌కు ఓటమి భయం అందుకే అక్రమాలు



చికమగళూరు : కర్ణాటక శాసన సభ ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. మంగళవారం రాత్రి రాజరాజేశ్వరి నగర్ నియోజకవర్గంలో ఓటరు గుర్తింపు కార్డుల కుంభకోణం బయటపడిన నేపథ్యంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. బీజేపీ తరపున ఎన్నికల ప్రచార సభలో బుధవారం ఆయన మాట్లాడుతూ నకిలీ ఓటరు గుర్తింపు కార్డులను తయారు చేసి ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ వ్యూహం పన్నిందన్నారు. అలాంటి పార్టీని ప్రజలు క్షమించకూడదన్నారు. దారుణ పరాజయం ఎదురవబోతోందనే భయంతో కాంగ్రెస్ అన్ని రకాల అక్రమాలకు పాల్పడుతోందన్నారు. కాంగ్రెస్‌కు పరాజయం తప్పదని తెలిసిపోయిందని, దీంతో ఆ పార్టీ మద్దతుదారులు రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ వస్తుందని ప్రచారం చేయడం మొదలుపెట్టారని అన్నారు. దీన్నిబట్టి రాష్ట్రంలో బీజేపీ సంపూర్ణ ఆధిక్యతతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అర్థం చేసుకోవచ్చునన్నారు. కాంగ్రెస్ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. కుల, మతాల ఆధారంగా అబద్ధాలు ప్రచారం చేస్తోందని, ప్రజలను విభజిస్తోందని అన్నారు.

### రాష్ట్రానికి పనిమంతులను తీసుకురండి

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రధాని మోదీ బుధవారం బంగారపేట ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తరువాయి 2లో

## అమరావతి లాంటి నగరం మరెక్కడా రాదు



- అధికారులపై నమ్మకం పెరిగింది
- ప్రతీ ఒక్కరికీ భాగస్వామ్యంతో విజయం సాధ్యం
- కలెక్టర్ల రెండోరోజు సదస్సులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి: నూతన ఆలోచనల సృష్టికి, ఒకరిని చూసి ఒకరు నేర్చుకునేందుకు కలెక్టర్ల సమావేశం దోహదం చేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సంక్షోభంలో జట్టుగా పనిచేసి ఎక్కడా లేని అభివృద్ధి సాధించామని.. అందుకు అధికారులను అభినందిస్తున్నట్లు చెప్పారు. అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సు రెండోరోజు ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇప్పటివరకు సాధించిన ఫలితాల్లో ప్రతీ తరువాయి 2లో



## తిరుపతిలో సందడిగా గంగమ్మ జాతర



### బైరాగి వేషంలో అమ్మవారికి మొక్కులు

తిరుపతి: రాయలసీమలోనే సుప్రసిద్ధ జాతరగా పేరొందిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మొదటి రోజు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. మంగళవారం రాత్రి అవిలాల నుంచి చాటింపుతో పసుపు కుంకుమలు తీసుకురావటంతో జాతర తరువాయి 2లో

## ప్రతి జిల్లాలో శిల్పారామాలను ఏర్పాటు చేయాలి

### కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

విశాఖపట్నం : రాష్ట్రాభివృద్ధిలో భాగంగా పర్యాటక రంగాన్ని అభివృద్ధిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అదే విధంగా ప్రతి జిల్లాలోను శిల్పారామాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు బుధవారం జిల్లా కలెక్టర్లను అదేశించారు. రెండోరోజు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పర్యాటకం, కాన్ఫరెన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రీ సెక్టర్, అర్బన్ డెవపల్‌మెంట్ మిషన్లు, నాలెడ్జ్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్, రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ తదితర అంశాలపై చర్చించారు. అరకు, లంబసింగ్ తదితర పర్యాటక ప్రాంతాలైనవి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేవని, వాటి ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకర్షించవచ్చునని, ఐటిడిఎ ఏజెన్సీ ప్రాంతంలో పిపిపి మోడ్‌లో రిసార్ట్‌లు, వసతుల కల్పనకు ఐదు, ఆరు, ఏడు స్టార్ల హెూటళ్ళ భాగస్వామ్యంతో నిర్మిస్తే బాగుంటుందని సూచించారు. విశాఖలలో గల బిఆర్‌టిఎస్ రోడ్లలో ఎలక్ట్రికల్ వాహనాలను నడిపే విధందా చూడవలసిందిగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌కు తెలిపారు. విద్యుత్ వినియోగంలో విశాఖ ప్రజలు సంతృప్తితో ఉన్నారని, ముఖ్యమంత్రి తెలుపుతూ సౌర విద్యుత్‌ను అధిక మొత్తంలో వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విశాఖలో పోర్టుకు సంబంధించి పనులను వేగవంతం చేయాలన్నారు. కాకినాడ నుంచి విశాఖపట్నం తరువాయి 2లో




## వారంలో పవన్ కల్యాణ్ యాత్ర

### మీటింగ్‌లలో తెలపనున్న పార్టీ విధివిధానాలు

### జనం సమస్యలే ప్రధానం.. నేడో రేపో తేదీ, పేరు ఖరారు

అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ యాత్రకు సిద్ధమవుతున్నారు. వారంలోపే యాత్ర ప్రారంభించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలనూ చుట్టివచ్చేలా యాత్ర ఏకబిగిన కొనసాగనుంది. యాత్ర పేరు, ప్రారంభ తేదీ, ఎక్కడ నుంచి ఎక్కడ వరకు ఉంటుందనేదీ తరువాయి 2లో




## దళిత భూములను బలవంతంగా లాక్కొంటున్నారు

### దళిత తేజం అంటూ పండగ చేసుకుంటున్నారు .. దళితుల పట్ల వివక్ష బాధాకరం

### చంద్రబాబు హామీలు ఏమయ్యాయి? .. ప్రజా సంకల్ప యాత్రలో జగన్ మాటలతూటాలు

మచిలీపట్నం : దళితుల భూములను ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటోందని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. జిల్లాలోని కైకలూరు నియోజకవర్గం పెరికగూడెంలో దళితులతో జగన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా దళితులను పట్టించుకోని ప్రభుత్వం, ఇప్పుడు దళిత తేజం పేరుతో మోసం చేస్తోందని విమర్శలు గుప్పించారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని, ఇంటికొక ఉద్యోగం ఇస్తానన్న చంద్రబాబు మాటలు ఏమయ్యాయని జగన్ నిలదీశారు.

### దళితుల పట్ల వివక్ష బాధాకరం
### ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్ జగన్

స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు గడుస్తున్నా దళితుల పట్ల ఇంకా వివక్ష కనపడటం బాధకరమని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ప్రజాసంకల్పయాత్రలో భాగంగా కృష్ణా జిల్లా పెరికగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన దళిత ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్ జగన్ మాట్లాడారు. దళితులపై నేటికి దాడులు జరుగుతుండటంపై దేశం మొత్తం సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు.





మంచి అన్నది మాల అయితే నేను మాలగా పుట్టడానికి సిద్ధమన్న గురజాడ అప్పారావు మాటలను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఎన్నికల సమయంలోనే దళితులు గుర్తుకు వస్తారని, అప్పుడు వచ్చి తనకంటే పెద్ద దళితుడు ఎవరూ లేరని అంటారని చెప్పారు. ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్లను సక్రమంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారని, అమలు చేయని వారిని జైల్లో పెడతామని పేర్కొన్నారని గుర్తు చేశారు.

అంటే నాలుగేళ్లలో కనీసం ఒక్క ఏడాదైనా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్లను అమలు చేయని చంద్రబాబును ఇప్పుడు జైల్లో పెట్టాలా? అంటూ ప్రశ్నించారు. ఇదే ముఖ్యమంత్రి దళితుడిగా ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా? అని వ్యాఖ్యానించడం సిగ్గు చేటని, నాయకుడు చూపిన బాటలోనే టీడీపీ నేతలు నడుస్తూ దళితులపై దారుణాలకు ఒడిగడుతున్నారని అన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో తనని తాను చంద్రబాబు తరువాయి 2లో



# మిడ్ లెవెల్ ప్రొవైడర్లు నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం: విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలలో మిడ్ లెవెల్ ప్రొవైడర్లు నియామకానికి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 13వ తేదీన సాయంత్రం నుండి 5 గంటల వరకు విశాఖ కేంద్రంలో వ్రాతపరీక్ష నిర్వహించబడునని విశాఖ ఆరోగ్య శాఖ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డా.జి.సావిత్రి తెలిపారు.

అభ్యర్థులు మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షా కేంద్రాలకుచేరుకోవాలని 2.30 గంటల తర్వాత ఎట్టి పరిస్థితిలోనూ పరీక్షాకేంద్రానికి అనుమతించమని స్పష్ట చేశారు. అభ్యర్థులు సిఎఫ్‌డబ్లు.ఎపిఐసి..ఐఎన్ వెబ్‌సైట్ నుండి లభ్యమయ్యే లింక్ ద్వారా దరఖాస్తునెంబరు, యూజర్ ఐడి, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ ఉపయోగించి తమ హాల్ టికెట్టు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

వారి దరఖాస్తు నెంబరు ఇతర సమాచారం సిఎఫ్‌డబ్లు. ఎపిఐసి..ఐఎన్ వెబ్‌సైట్‌లో పొందపర్చబడుతుందని తెలిపారు.

# న్యాయశాస్త్ర పట్టబద్ధులకు శిక్షణ

విజయనగరం : షెడ్యూల్డ్ కులాలకు చెందిన న్యాయశాస్త్ర పట్టబద్ధులు 2018-19 సం.నకు మూడు సంవత్సరాల శిక్షణ కోసం దరఖాస్తులుఆహ్వానిస్తున్నామని సాంఘికసంక్షేమ శాఖ ఉప-సంచాలకులు కె. సునీల్ రాజ్‌కుమార్ తెలిపారు. తమకార్యాలయంలో దరఖాస్తు ఫారాలు లభించునని, సంవత్సర ఆదాయం 2 లక్షల రూ. లోబడి ఉండాలని,5 ఖాళీలున్నాయని తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఉప-సంచాలకులు, సాంఘీక సంక్షేమ శాఖ,మర్రిచెన్నారెడ్డి భవనం అనే చిరునామాకు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా అందించాలని తెలిపారు.

శిక్షణాకాలంలో నెలకు 1000 రూపాయలు శిక్షణ భృతి, మూడు ఏళ్ళపాటు ఇస్తారని, అలాగే పుకాలు, ఫర్నీచర్‌కు 6 వేల రూపాయలు, ఎన్‌రోల్‌మెంట్ ఫీజు 585 రూపాలు చెల్లించబడునని తెలిపారు. శిక్షణ ప్రభుత్వ పీడర్లు, పి.పిలు, అసిస్టెంట్ పిపిల వద్ద ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఈ నెంబర్లు (08922-273676, 8332997707) సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

# ఘనంగా ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు



అనకాపల్లి : గవరపాలెం బైపాస్ రోడ్, తోటాడ జంక్షన్ వద్ద గల శ్రీవీరాంజనేయ ఆలయంలో గురువారం ఉదయం ఆరు గంటల నుంచి మూలవీరాట్‌కు అభిషేకాలతో జయంతి కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని,

శ్రీ వీరాంజనేయ స్వామి కమిటీ సభ్యులు తెలిపారు. వీరాంజనేయ స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు పద్మావతి దంపతులచే 1997 లో స్థాపించడం జరిగిందన్నారు. ఉదయం 8 గంటల నుంచి పాలాభిషేకం, పంచామృత అభిషేకం, సకలకోటి జీవరాసులు చల్లగా ఉండాలని, వరుణ యాగహెూమం, రుద్రహెూమం, భక్తులతో చేయించబడునని, అన్నారు. ఉదయం 10 గంటల నుంచి శ్రీ చిన్నరామ సేవ వారిచే సేవా కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఉదయం 11 గంటల నుంచి భారీ అన్నసమారధన కార్యక్రమం జరిగిందన్నారు. భక్తులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని శ్రీ వీరాంజనేయస్వామి కమిటీ సభ్యులు కోరారు.

## బాక్సింగ్ క్రీడలో గోల్డ్ మెడల్ సాధించిన పెద్దాడ సంతోష్

### -అభినందనలు తెలిపిన పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



గాజువాక: పారిశ్రామికప్రాంతం జీవీయంసీ 49వ వార్డు హరిజనవిధికి చెందిన పెద్దాడ సంతోష్ బాక్సింగ్ క్రీడలో(సూపర్ వెయిట్)లో బంగారు పథకాన్ని సాధించాడు. ఈ నెల 4,5,6 తేదీలలో గాజువాక నడుపూరు హైస్కూల్ ప్రాంగణంలో విశాఖ జిల్లా అమెత్యూర్ బాక్సింగ్ అషోసియోషన్ ఆధ్వర్యంలో జరిన ఓపెన్ బాక్సింగ్ క్రీడలో ఎస్.పి.యం బాక్సింగ్ క్లబ్ తరుపున పోటీలలో పాల్గొని ఫైనల్‌కు చేరకొని బంగారు పథకాన్ని, దృవపత్రాన్ని కైవసం చేసుకున్నారు.

ఈ మేరకు బుధవారం పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే గణబాబు ఆశీర్వాదం కోసం వెళ్ళిన సంతోష్‌ను ఎమ్మెల్యే గణబాబు అభినందించారు. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన క్రీడాకారుడు బంగారు పథకాన్ని సాధించడం అభినందనీయమని, మరిన్ని బంగారు పథకాలను సాధించి దేశానికి పేరుతేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ నాయకుల అరెస్టులకు

# వైసీపీ నేతలు నిరసన



అనకాపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు నవ భారత నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర రాజదానిలో నెలకొల్పుతామని మాటి ఇచ్చి తప్పినందుకు, రాష్ట్ర వైఎస్ఆర్‌సిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు మాజీ ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్ మేరుగు నాగార్జునను అరెస్టు చేసినందుకు నిరసనగా బుధవారం పట్టణంలో రామచంద్రధియేటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసనలు తెలియజేసారు. నిజం మాట్లాడితే అరెస్టులు చేయడమేనా మీ ప్రభుత్వం ధ్యేయమని వారు ఆగ్రహం వ్యక్తం చేసారు. నిజాన్ని నిర్భయంగా అడిగితే, గొంతు నొక్కుతారా, నిదీస్తే అరెస్టులు చేస్తారా అని,వారు ఆందోళన వ్యక్తం చేసారు. అంబేద్కర్ బిక్షతో ప్రజా ప్రతినిధులు, మంత్రులుగా చెలామణి అవుతూ అంబేద్కర్ విగ్రహం పెడతానని, మాటతప్పిన చంద్రబాబునాయుడును తెలుగ ఎదేశం పార్టీలో ఉన్న, దళిత ప్రజా ప్రతినిధులు ఎందుకు నిలదీయరని వారు ఆవేదన వ్యక్తం చేసారు. ఇకనైనా దళితులపై దాడులపై చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఇప్పటికైనా ఇచ్చిన మాటలు దేశం నాయకులు నిలబెట్టుకోవాలని లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉదృతం చేస్తామని అన్నారు. అనకాపల్లి పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులు మామిడి నూకరాజు అన్నారు. ఎస్సీ నాయకులకు అరెస్టులకు నిరసనగా వైఎస్ఆర్‌సిపి యువజన అధ్యక్షులు జాజుల రమేష్ , గైపూరి రాజు, సహాయ కార్యదర్శి మద్దా కుమార్, రాజాన బుజ్జిబాబు, దేవర భాస్కరరావు, శ్యామ్ సంతోష్, పెదిరెడ్డి సూర్య ప్రసాద్, రాజు, తదితరులు మద్దతును తెలియజేసారు.

# దేముడికి శఠగోపం..సిబ్బంది చేతివాటం

## (కలయా..వైష్ణవ మాయ)



విజయనగరం: దేవాదాయ ధర్మదాయ శాఖలో చాలా దేవాలయాలకు సరైన పోషణ కరవైంది. పాపం కొన్నిచోట్ల దీపాఆధన కూఆ లేదని పూజారులు వాపోతున్నారు. చాలా ఆలయాలకు భూములున్నా వాటి ఆదాయం తగిన విధంగా లేకపోవటంతో సిబ్బందిని...కౌలు రైతులను పర్యవేక్షించాలని భావిస్తున్నారు. విజయనగరం మాన్సాస్‌ట్రస్ట్ పరిధిలో 104 దేవాలయాలున్నాయి. వాటిని దేవదాయ శాఖ పర్యవేక్షిస్తోంది. కేవలం వారిపైనే వాటి నిర్వహణ బాధ్యతలు వదిలివేసి...మాన్‌సాస్ నమ్మకంగా చాలా ఏళ్ళు గడిపింది. కానీ,ఇటీవల ఎందుకో వాటిని పర్యవేక్షించాల్సి బాధ్యత వుందని, నిఘా పెట్టాలని భావించింది. ఇంతవరకూ సిబ్బంది కేవలం దేవదాయ శాఖకు మాత్రమే జవాబుదారీగా ఉండేది. ఇప్పుడు పర్యవేక్షణ బాధ్యతను మాన్సాస్ కూడా తీసుకోవటంతో ఇద్దరికీ సమాధానం చెప్పాలి. అంటే ముఖ్యంగా అధికారులకు బాధ్యతలు పెరిగినట్లే లెక్క. కార్యనిర్వాహణాధికారులు వాటి బాగోగులు ఏ మేరకు చూస్తున్నారు? వారి పనితీరుపై ఒక కన్ను వేసి ఉంచాలని మాన్సాస్ భావించడంతో కొందరికి ఈ నిర్ణయం మింగుడుపడలేదు. ఆస్తులు..ఆదాయం గణాంక వివరాలతో అధికారులు హాజరుకావాలని మాన్సాస్ చెప్పేసరికి చాలామంది గుండెల్లో రైళ్ళు పరిగెట్టాయి. కారణం ఇంత వరకూ సరైన లెక్కా, జమా లేకుండా కాలక్షేపం చేయటంతో వారి ఆధిపత్యానికి ఎదురుదాడి మొదలైందని తెలియవచ్చింది. ఆలయాలపై ఉమ్మడి సిఘాపై పలువురు చెవులు కొరుక్కుంటున్నారు. ఆలయాలకు ఉన్న భూములు కొన్నిచోట్ల పెత్తందారుల చేతికి వెళ్ళిపోయాయని అనుమానం రావటం ఒక కారణం కాగా...వేల కోట్లు విలువచేసే భూములను వేలం వేయటం..కౌలుకు ఇవ్వటం అంతా దేవదాయ శాఖ చేయటం వల్ల మాన్సాస్‌కు రానురాను పట్టు సడలుతోందని అనుమానిస్తున్నారు. అయితే ఇంతకాలం తగిన సిబ్బంది మాన్సాస్‌లో లేరు. ముందు వారిని నియమించకపతే ఈ ప్రక్రియ విజయవంతంగా ముగించటం కష్టమని అభిప్రాయపడుతున్నారు. ఇక ఏ ఆలయానికి ఎంత భూమి ఉంది..వాటి ఆదాయ.. వ్యవయాలు.. .సిబ్బంది పర్యవేక్షణ ఇత్యాదులన్ని ముందు గమనిస్తే...వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తే కానీ ఈ సమస్య ఒక కొలిక్కిరాదని భావించి ఈ నెల 15వ తేదీన ఆలయ వివరాలతో మాన్సాస్‌కు రావాలని ఆ మేరకు దేవదాయ శాఖ సిబ్బందికి సూచనలు...ఆదేశాలు ఇచ్చారు.పదిహేను మంది కార్యనిర్వాహణ అధికారులు ఉండవలసిన స్థానాల్లో కేవలం అయిదుగురు మాత్రమే పనిచేస్తున్నారు. వీరిపై ఈ బాధ్యతలు పడ్డాయి. నామమాత్రపు శిస్తుతో ఎంతమంది పెత్తందార్లు ఆలయ భూములను తీసుకున్నారు. వాటికి విధివిధానాలు ఏంటని ప్రశ్న రావటంతో ఈ ప్రహసం బయటకు వచ్చింది. ఈనెల 15వ తేదీ తరువాత పూర్తి స్థాయి సమాచారం మాన్సాస్ సంపాదించగలదని తెలిసింది. శ్రీకాకుళం జిల్లాలో శ్రీకూర్మం దేవాలయానికి ఆరు దేవాలయాలు, విజయనగరం పైడితల్లమ్మ దేవాలయాని 25చ రామతీర్థాలు దేవాలయానికి 15, ధర్మవరం దేవాలయానికి 26చ పద్మనాభం దేవాలయానికి 21, మండపల్లి దేవాలయానికి 11, దేవాలయాలను ఇంతవరకు అనుసంధానం చేసి వాటి నిర్వహణ పర్యవేక్షిస్తున్నారు. అయితే ఆయా ఆస్తులు అన్నాక్రాంతమైన..తగిన సిబ్బంది లేకపోవటంతో కార్యనిర్విహాధికారులు ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. కానీ,వారిని ఏదోవిధంగా సమాధానపరిచి పంపివేయటంతో ఇప్పుడు..వారి పరిస్థితికి మంచి రోజులు వస్తాయని భావిస్తున్నారు. ఆయితే సిబ్బంది చేతివాటం పెద్దగా లేకపోయినా...దేవుని మాన్యాలకు శఘగోపం పెట్టడంపై దృష్టి సారించటంతో కదలిక మొదలైంది.



**మొదటి పేజీ తరువాయి**

## అమరావతి లాంటి నగరం మరెక్కడా లేదు

ఒక్కరికీ భాగస్వామ్యం ఉందన్న ముఖ్యమంత్రి... విజయం అనేది నిరంతరం శ్రమతో సాధ్యమని, కొద్దిపాటి మనసు పెడితే అద్భుతాలు సాధించవచ్చన్నారు. అమరావతి లాంటి నగరం ప్రపంచంలో మరెక్కడా రాదన్నారు. భారతదేశంలో ఉత్తమ ఫలితాలు సాధించిన టీమ్ తమదేనని.. తాము చేపడుతున్న కార్యక్రమాలు ధనిక రాష్ట్రాలు కూడా అమలు చేయలేకపోతున్నాయని అన్నారు. నాలుగేళ్ల విజయాల్లో గ్రామస్థాయి అధికారి నుంచి సీఎంవో అధికారుల వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉందన్నారు. ప్రస్తుతం ఒక స్థాయికి వచ్చామని, దానిని నిలుపుకుంటూ ఇంకా ముందుకు వెళ్లేందుకు మనందరం మరింత కష్టపడాలని సీఎం సూచించారు. ఒక జిల్లా విజయం సాధించాలన్నా, ఒక కార్యదర్శి విజయం సాధించాలన్నా, మంత్రి విజయం సాధించాలన్నా మంచి జట్టును ఏర్పాటు చేసుకోవాలన్నారు. తాము పేరు కోసమే పనిచేసే వాళ్లమని, తాము చేసే అభివృద్ధి, మంచిపనుల వల్ల తమ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.

ఆంధ్రప్రదేశ్ 2029 కంటే ముందే దేశంలో నంబర్‌వన్ రాష్ట్రం అవుతుందని.. తన జట్టు(అధికారులు)ను చూశాక ఆ నమ్మకం రెట్టింపయ్యిందని చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఇన్నోవేటర్స్ అందరూ ఏపీకి వచ్చేలా చూడాలన్న ముఖ్యమంత్రి, వాళ్ల ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ వేదిక కావాలన్నారు. ఇండియాలో ఇన్నోవేషన్ వ్యాలీ ఎక్కడ ఉందంటే ఏపీనే గుర్తుకురావాలని, ఆరోజు ఎంతో దూరంలో లేదన్నారు. ప్రతీ శాఖ వినూత్న ఆవిష్కరణల గురించి ఆలోచన చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్ శాఖ ఈ విషయంలో ముందుందని, గ్రామాలకు సంబంధించి సమస్త సమాచారాన్ని అందులో నిక్షిప్తం చేయడం అభినందనీయమన్నారు.

పరిష్కార వేదిక కాల్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్లు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎవరైనా అవినీతి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ సమాచారాన్ని ఆర్టీజీ ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తామని.. ఈ సమాచారాన్ని అధికారులు ఉపయోగించుకుంటే చాలా మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ నెలలో ప్రజల సంతృప్తి స్థాయిని 5శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## దళిత భూములను బలవంతంగా లాక్కుంటున్నారు

దళిత తేజంగా కీర్తించుకుంటున్నారని, ఇలాంటి వ్యక్తి దళిత తేజం అయితే దళితులందరూ ఎక్కడిపోవాలని ప్రశ్నించారు. నాలుగేళ్ల పాలనలో చంద్రబాబు దళితులకు ఎక్కడైనా మేలు చేసినట్టు కనిపించిందా?. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా దళితులు ఇబ్బందులు పడుతున్నారు. కారంచేడు ఘటన నుంచి ఇప్పటివరకూ అదే తరహాలో టీడీపీ పాలన సాగుతోంది.

## కాంగ్రెస్‌కు ఓటమి భయం అందుకే అక్రమాలు

ప్రచార సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్‌కు కాలం చెల్లింది. ఈ ఎన్నికల ఫలితాల తర్వాత ఇక కాంగ్రెస్ ఇక్కడ పోటీ చేయాల్సిన అవసరం రాదు. కాంగ్రెస్ విభజన రాజకీయాలతో కర్ణాటక ప్రజలు విసిగి పోయారు. ఐదేళ్లలో కర్ణాటకను భ్రష్టు పట్టించారు. భారతీయులందరూ నా సంరక్షణలో ఉన్నారు. కానీ అందులో కర్ణాటక ప్రజలు మాత్రం ప్రమాదం అంచుల్లో ఉన్నారు. కర్ణాటక రాష్ట్ర గౌరవాన్ని కాంగ్రెస్ మంటగలిపింది. మాటలు చెప్పి కాలం గడిపే వారిని సాగనంపండి. రాష్ట్రానికి పనిమంతులను తీసుకురండి. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశిస్తాయి. మంచి పాలకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలదే. కాబోయే ప్రధానిని నేనే అని తనకు తానుగా రాహుల్ గాంధీ ప్రకటించుకున్నారు. దీన్ని బట్టి ఆయన ఎంతటి గర్విష్టో అర్థమవుతోంది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారందరూ అహంకారులే. వారిది అహంకారీ పార్టీ. గర్వంగానే మాట్లాడతారు. వాళ్లకు ప్రజల సమస్యలను పట్టించుకునే మనసు లేదు. మన్మోహన్ సింగ్ పేరుకు మాత్రమే ప్రధాని. కానీ ఆయన తన పార్టీ నేతల కనుసన్నల్లో పనిచేసేవారు. వీళ్లందరికీ సోనియాగాంధీ సారథిగా వ్యవహరించేవారు. కాంగ్రెస్ రిమోట్ కంట్రోల్ సోనియా దగ్గర ఉంది. కానీ భాజపా రిమోట్ 125కోట్ల భారత ప్రజల చేతిలో ఉంది. ప్రజలే నాకు హైకమాండ్. వారు చెప్పిందే నేను వింటాను. కాంగ్రెస్ ఆరు సీలను అనుసరించి పాలన సాగిస్తోంది. కాంగ్రెస్ కల్చర్, కమ్యునలిజం, కార్టెలిజం, క్రైమ్, కరప్షన్, కాంట్రాక్ట్. ఇవి లేకపోతే కాంగ్రెస్ లేదు అని కాంగ్రెస్‌పై విమర్శలకు దిగారు.

మరో మూడురోజుల్లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రేపటితో ప్రచార గడువు ముగియనుండటంతో రాజకీయ పార్టీలు ప్రచారంలో జోరు పెంచాయి. ఈ ఫలితాలు మే 15న వెలువడనున్నాయి.

## ప్రతి జిల్లాలో శిల్పారామాలను ఏర్పాటు చేయాలి

వరకు పైప్ లైన్ల ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. విశాఖపట్నం నుండి కృష్ణా జిల్లా వరకు సిఎస్ జిల్లా వాహనాలను నడపాలని వాటికి సంబంధించి సిఎస్‌జి బంకులను ఏర్పాటు చేయాలన్నారు. విశాఖపట్నం నుండి శ్రీకాకుళం వరకు సముద్రతీర ప్రాంతంలో విలాస్ అండ్ రెస్టారెంట్లు కల్పించాలన్నారు. కైలాసగిరి మలుపును తప్పించి విశాఖ నుండి భీమిలి, సాగర్‌నగర్ వెళ్ళేందుకు వంపులు లేని రహదారిని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గతుకులు లేకుండా రోడ్లను తీర్చిదిద్దాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని గృహాలన్నింటిన సంవత్సరాంతానికి పూర్తి చేయాలన్నారు. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో గృహ నిర్మాణాలప్రగతి బాగానే ఉందని సంతృప్తిని వ్యక్తం చేశారు. అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని, కావలసిన స్థలాలను సేకరించి పూర్తి చేయాలన్నారు. ఓడిఎస్ ప్లస్‌లో భాగంగా డ్రైవ్‌ల నిర్మాణం, పాఠశాలలో శత శాతం మరుగుదొడ్ల శాతం నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ నాటికి వీటన్నింటినీ పూర్తి చేయాలన్నారు. ముందస్తు ప్రణాళికలు తయారు చేసి సమర్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో విశాఖ జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లా నుండి జాయింట్ కలెక్టర్-2 డాక్టర్ సిరి, సిపిఓ రామశాస్త్రి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతిలో సందడిగా గంగమ్మ జాతర

ప్రారంభమైంది. జాతర మహోత్సవంలో తొలి రోజు భక్తులు బైరాగి వేషంతో గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఏడుకొండల వెంకన్నకు ఆడపడుచుగా భావించే గంగమ్మకు నిర్వహించే ఈ జాతరను వీక్షించేందుకు తిరుపతి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా రాయలసీమ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో గంగమ్మ ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

పూర్వం చిత్తూరు జిల్లా ప్రాంతంలో పాలెగాళ్ల అరాచకాలు ఎక్కువగా ఉండేవని... వారి దురాగతాలు నానాటికీ ఎక్కువ కావటంతో అమ్మవారు గంగమ్మ తల్లిగా ఉద్భవించిందని స్థల పురాణం. అమ్మవారికి భయపడిన అప్పటి పాలెగాడు ఆమెకు కనపడకుండా దాక్కొని జీవించేవాడట. పాలెగాడిని బయటకి రప్పించేందుకు గంగమ్మ తల్లి రోజుకో వేషంతో సంచరించేదని ఆలయ ప్రశస్తి. నాటి నుంచి భక్తులు అమ్మవారికి ఏటా చైత్రమాసం చివరి వారంలో తొమ్మిది రోజుల పాటు రోజుకో వేషంతో వైభవోపేతంగా జాతర నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు భక్తులు బైరాగి వేషాన్ని ధరించి అమ్మకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. పొంగళ్లు, అంబలి సమర్పిస్తున్నారు. చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ బైరాగి వేషం ధరించి అమ్మవారిని దర్శించటం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని భక్తులు అంటున్నారు. ఆఖరి రోజు చప్పరాల ఊరేగింపుతో గంగమ్మ జాతర ఘనంగా ముగుస్తుంది.

## వారంలో పవన్ కల్యాణ్ యాత్ర

ఒకట్రెండు రోజుల్లో ఖరారు చేయనున్నారు. యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌పై కసరత్తు కూడా కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ యాత్ర కోసం ఒక వావానాన్ని ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. ఈ వాహనంతోపాటు, యాత్ర ఎక్కడ నుంచి ప్రారంభమై, ఎక్కడ ముగించాలనేదీ పవన్ కల్యాణ్ ఖరారు చేయాల్సి ఉంది. ప్రజల్లోకి వెళ్లడం.. ఎక్కడికక్కడ స్థానిక సమస్యలను గుర్తించడం.. రాష్ట్రంలో ఉన్న పరిస్థితులు, పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లడం లక్ష్యంగా యాత్ర చేపడుతున్నారు. ప్రధాన సమస్యలున్న ప్రాంతాలకు వెళ్లినపుడు ఆ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఎలాంటి ఒత్తిడి తీసుకొచ్చేదీ వాటి పరిష్కారంలో పార్టీ విధానం ఏంటనేదీ అక్కడికక్కడే ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. పార్టీ కమిటీల ఏర్పాటు కొనసాగుతున్నందున ఆయా జిల్లాల్లో వాటి పురోగతిపై పార్టీ ప్రతినిధులతో సమీక్షలు నిర్వహించనున్నారు.

# పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా

- వార్డు ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటా
- వేసవి కాలంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభం
- 37వ వార్డు టిడిపి అధ్యక్షుడు గంకల అప్పారావు




కంచరపాలెం: సామాన్య కార్యకర్తనైన నన్ను పార్టీ నమ్మి రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి ఇచ్చినందుకు నేను రాష్ట్ర ముఖ్య నారాచంద్ర బాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను .అలాగే వార్డులో గల ప్రజలు నేను చేసే ప్రతి కార్యక్రమానికి నాకు తోడుగా నిలుస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. బుధవారం ఉదయం 37వ వార్డు పరిధిలో గల రాంజీ ఎస్టేట్ గ్రామంలో గల తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు యాగాటి ఆదిలక్ష్మి అద్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గంకల అప్పారావు ప్రారంభించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం శ్రమిస్తూ పార్టీ కోసం ప్రజల కోసం కృషితో పనిచేస్తానని తెలియజేసారు. విభజన హామీలు ప్రత్యేక హోదా కోసం పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి నారాచంద్ర బాబు నాయుడుకు ప్రజలు అండగా నిలబడాలని కోరారు. రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించినందుకు వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, రాంజీ ఎస్టేట్ గ్రామ ప్రజలు గంకల అప్పారావుకు శాలువాకప్పి పూలమాలవేసి సత్కరించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విశాఖ అర్బన్ జిల్లా కార్యదర్శి ఆవాల నారాయణస్వామి, రొంగలి మహేశ్వరరావు , గునుపూడి నాగేశ్వరరావు , జి.పి అంథోని , రాంజి ఎస్టేట్ గ్రామ ప్రజలు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బీచ్ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

- లాసన్స్‌బే, పెదజాలరిపేట బీచ్‌లను శుభ్రపరచండి
- వర్షాలకు కొట్టుకు వచ్చే చెత్తను యుద్ధప్రాతిపదికన తొలగించండి
- గెడ్డలు, డ్రైయిన్లలో చెత్త, ప్లాస్టిక్ వేయకుండా చూడండి
- ప్రజలు చైతన్యవంతమైతేనే పరిశుభ్రతకు దోహదం
- 16వ వార్డులో పర్యటన
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: లాసన్స్‌బే బీచ్, పెదజాలరిపేట బీచ్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ ఆదేశించారు. క్షేత్రపర్యటనలో భాగంగా బుధవారం ఆయన పెదవాల్తేరు, శివాజీపాలెం, డాక్టర్స్ కాలనీ, ప్రశాంతినగర్, లాసన్స్‌బే బీచ్, పెదవాల్తేర్ బీచ్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డస్ట్‌బిన్లను సక్రమంగా వినియోగించుకోనేలా చూడాలని ఆదేశించారు. అదేవిదంగా 16వ వార్డు, డాక్టర్స్ కాలనీ జివియంసి పంప్‌హౌస్, రిజర్వాయర్ ప్రాంతాలను సందర్శించారు.రోడ్ మార్జిన్లను సక్రమంగా నిర్వహించాలని, డ్రెయిన్లను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. పెదవాల్తేర్ రామలక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదురుగా నున్న డ్రెయిన్ బ్లాక్ అయినందున పూడిక తొలగించి వర్షపునీరు, మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగకుండా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

డాక్టర్స్ కాలనీ జివియంసి -రామరాజునగర్ పార్కు వద్ద చెత్తను తొలగించాలని ఆదేశించారు. ఉన్న కాల్వలను పూడ్చి వేయడం వలన వర్షపునీరు రోడ్డుపై ప్రవహించడానికి కారణమవుతున్నందున కాలువల పూడిక తొలగించాలని పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్లపై వేసిన ట్రీవేస్ట్‌ను, డెబ్రిస్‌ను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీ స్థలంలో చెత్తను వేయడం వలన అపారిశుధ్యంనెలకొంటున్నందున పరిశుభ్రం చేయాలని, జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ బంగారురాజు, ఏ.యం.ఓ.హెచ్ డా.లక్ష్మితులసిని ఆదేశించారు. ప్రశాంతినగర్‌లో యుజిడి కనెక్షన్లను గృహాలకు కలపాలని పేర్కొన్నారు.



గాయత్రి ఎస్టేట్స్, యం.జి.ఆర్ ఆసుపత్రి, బ్లూ హెూమ్స్ సర్వీస్ అపార్ట్‌మెంట్లకు పరిశుభ్రత లేనందున జరిమాన విధించాలని ఏసిపి నాయుడు, జోనల్ కమిషనర్ నల్లనయ్యను ఆదేశించారు.

అనంతరం లాసన్స్‌బే బీచ్‌ను సందర్శించారు. బీచ్‌లో చెత్తను సత్వరం తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. చెత్తను సిబ్బంది, జెసిబితో తొలగిస్తున్నట్లు జోనల్ కమిషనర్ నల్లనయ్య తెలిపారు. తదుపరి పెదజాలరిపేట తీర ప్రాంతాన్ని సందర్శించి చెత్త పేరుకుపోవడానికి గల కారణాలను పరిశీలించారు. ఏది ఏమైనా తీరప్రాంతంలో చెత్తను తొలగించాలని పేర్కొన్నారు. వర్షాలు వచ్చేలోగా చెత్తను తొలగించాలని ఆదేశించారు

***తీరప్రాంత పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి***

నగర ప్రజలు ఎవరికి వారు చెత్త, ప్లాస్టిక్‌ను గెడ్డలు, కాలువలలో పారవేయడం వలన వర్షాలకు ఆ చెత్త, ప్లాస్టిక్ గెడ్డలనుండి తీరప్రాంతానికి చేరి అపారిశుధ్యానికి కారణమవుతున్నట్లు కమిషనర్ హరినారాయణన్ అభిప్రాయ పడ్డారు. జివియంసి అధికారులు, ప్రజారోగ్య సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెత్త, ప్లాస్టిక్‌ను గెడ్డలు, కాలువలలో వేయకుండా చైతన్యవంతం చేయాలని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలందరు ఎవరికి వారు చెత్త, ప్లాస్టిక్‌ను కాలువలలో వేయరాదని నిర్ణయించుకొని సహకరిస్తే తీరప్రాంతం పరిశుభ్రతకు దోహదపడుతుందని అభిలషించారు.

పర్యటనలో రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య, ఇ.ఇ వెంకటి, ఏ.యం.ఓ.హెచ్ డా.లక్ష్మితులసి, ఏసిపి నాయుడు, ఏ.ఇ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రుణాలు పొందేందుకు బ్యాంకర్లు సహకరించాలి

## ఎంపీపీలు రమణమ్మ, సన్యాసిదేముడు




మెప్మా కార్యాలయంలో సమావేశం

నర్సీపట్నం : రుణాలు పొందేందుకు బ్యాంకర్లు సహకరించాలని నర్సీపట్నం, నాతవరం ఎంపిపిలు సుకల రమణమ్మ, శింగంపల్లి సన్యాసిదేముడులు కోరారు. బుధవారం నర్సీపట్నం మెప్మా కార్యాలయంలో నర్సీపట్నం అర్బన్, నాతవరం, నర్సీపట్నం రూరల్ మండలాలకు సంబంధించి 2016-2017 సంవత్సరంలో రుణాలు మంజూరైనా యూనిట్లు నెలకొల్పకపోవడం, సబ్సిడి మంజూరు కాకపోవడంపై అటు బ్యాంకర్లు, ఇటు ఎస్సీ, ఒసి, బిసి కార్పోరేషన్లు అధికారులతోనూ లబ్ధిదారుల సమక్షంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంత మంది బ్యాంకర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఆ బ్యాంకుల అధికారులు హాజరు కాలేదు. బ్యాంకు అధికారులు తీరును లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒ రవి, ఎస్సీ కార్పోరేషన్ నుండి సత్యనారాయణ, ఎలీషా, స్వరూప్, భాస్కర్, బిసి కార్పోరేషన్ నుండి డేవిడ్, అప్పారావు, కుమార్, ఎస్సీ కార్పోరేషన్ జిల్లా లీగ్ ఫెసిలిటేటర్ ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గణబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలను తెలిపిన పత్రికా ప్రతినిధులు



గాజువాక: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వివిధ పత్రికల్లో విధులు నిర్వహిస్తున్న పత్రికా ప్రతినిధులు బుధవారం పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే గణబాబు పుట్టిన రోజు సందర్భంగా గోపాలపట్నంలోని ఆయన స్వగృహంలో గణబాబును కలిసి పుష్ప గుచ్ఛానిచ్చి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులను చేరుకోవాలని, ఆయనకు ఆయు రారోగ్య అష్ట ఐశ్వర్యాలను భగవంతుడు ప్రసాదించాలని కోరారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపినవారిలో ఈనాడు విలేఖరి రాజు, ఆంధ్రజ్యోతి విలేఖరి గిరి, ప్రజాశక్తి విలేఖరి నూనెల పైడిరాజు, పబ్లిక్ పత్రికా విలేఖరి శ్రీనివాసరావు, విజన్ పత్రికా విలేఖరి మజ్జిరమేష్ తదితరులు ఉన్నారు.

# సమస్యలను ఎమ్మెల్యే ముందు ఏకరువు



యలమంచిలి రూరల్ : రాంబిల్లి మండలంలోని కొత్తపట్నం, వాడనర్సాపురం, కొప్పుగొండుపాలెం గ్రామాల మరియు ఎన్.ఎ.ఓ.బి.కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని బుధవారం అచ్యుతాపురం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయములో యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు ఆయా గ్రామస్థులు సమస్యలు ఏకరువు పెట్టారు. తమ గ్రామంలో ఎప్పటి నుండో పరిష్కారం కానీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో ఎన్ఎఓబి. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, అచ్యుతాపురం, రాంబిల్లి తహసీల్దార్లు, అచ్యుతాపురం మరియు రాంబిల్లి మండలాల మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఎమ్.పి.టి.సి.సభ్యులు పాల్గొన్నారు.

# వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలతో ఇబ్బందులు

యలమంచిలి రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో కరెంట్ కోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేళాపాళా లేకుండా కరెంట్ నిలిపివేయడంతో వినియోగదారులు మండిపడుతున్నారు. ఒక వైపు ఎండల తీవ్రత అధికంగా ఉండటం, మరో వైపు ఉక్కపోత ఉంది.ఫ్యాన్‌ల కిందకు వృద్దులు, మహిళలు, చిన్నారులు చేరుతున్నారు. అయితే అదే సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడంలో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఏటి కొప్పాక పద్మనాభరాజుపేట, బయ్యవరం, ములకలాపల్లి, పులపర్తి, లక్కవరం, కృష్ణాపురం, గూండ్రుబిల్లి, పోతిరెడ్డిపాలెం, రుక్మిణిపురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో తెలియడం లేదని ఆయా గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరుతున్నారు.

# రూ.2 కోట్లతో మున్సిపల్ పాఠశాలల ఆధునికీకరణ



విశాఖపట్నం : జివియంసికి చెందిన రెండవజోన్ లోని మున్సిపల్ పాఠశాలలను రూ.2కోట్లతో నిర్వహిస్తున్న ఆధునికీకరణ, మౌళిక సదుపాయాలను బుధవారం కమిషనర్ హరినారాయణన్ పరిశీలిం చారు. ఈ సంద ర్భంగా పెదవాల్తేర్, ఇసుకతోట, వెంకోజి పాలెం, సీతంపేట, శివాజీపాలెం పాఠశాలలకు నిర్వహిస్తున్న ఆధునికీకరణ, మౌళిక సదుపాయాలకు సంబంధించిన పనులను పరిశీలించారు. అడ్మిని స్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ సూచించిన స్టాండర్డ్స్ ప్రకారం అన్ని పాఠశాలలకు అన్ని హంగులను కల్పించనున్నట్లు వెల్లడించారు. రెండవ జోన్‌కు చెందిన 16 పాఠశాలలకు రూ.2 కోట్లతో ఆధునీకరించడానికి పనులు కొనసాగుతున్నందున పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలలకు అన్ని హంగులతోబాటు ఆట స్థలాలు, ఆట ఎక్విప్‌మెంట్, తరగతి గదులకు ఆధునిక టైల్స్, బ్లాక్‌బోర్డులు, టాయిలెట్స్, త్రాగునీటి పైపులు, అవసరమైనచో బోరుబావులు, పార్కుల తరహాలో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూన్ మొదటి వారం నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలకు దీటుగా ఎటువంటి విమర్శలకు తావులేకుండా పనులు నిర్వహించాలని కోరారు.


**మిలటరీ ఇంజనీర్ సర్వీసెస్**

ఇ-టెండర్ల ఆహ్వాన ప్రకటన

కమాండర్ వర్క్స్ ఇంజనీర్స్, స్టేషన్ రోడ్, విశాఖపట్నం-530 004 వారు భారత రాష్ట్రపతి తరపున సింగిల్ స్టేజ్ రెండు కవర్ బిడ్ విధానంలో ఆన్‌లైన్ రేట్ బిడ్ కోరుచున్నారు.

| | | | |
|---|---|---|---|
| 1. | పనిపేరు | : | జిఇ(ఎన్‌డి) విశాఖపట్నం పరిధిలో కోస్టు గార్డు వద్ద అధికారులు మరియు నమోదిత వ్యక్తులకై వివాహిత నివాసము కొరకు ఫర్నీచరు కల్పన. |
| 2. | అంచనా ధర | : | రూ. 104.00 లక్షలు |
| 3. | పూర్తిచేయు కాలం | : | 09(తొమ్మిది) నెలలు |
| 4. | టెండరు ఐడి | : | 2018_ఎంఇఎస్_180716_1 |

మరిన్ని వివరాలకై వెబ్‌సైట్: www.defproc.gov.in /eprocure.gov.in/mes.gov.in చూడగలరు.

గమనిక:-

1. వార్తా పత్రికలలో ప్రచురించబడిన ప్రకారం బిడ్లు కోరుతూ ప్రకటన టెండరు/బిడ్ డాక్యుమెంట్ ప్రకటనలో నమూనా భాగం కాదు.
2. టెండరు (ఐటమ్స్ రేట్) రకం వర్తిస్తుంది మరియు బిడ్ సిస్టమ్ స్వీకరించు అధికారిచే నిర్ణయించిన ప్రకారం ప్రత్యేకంగా తెలియజేయబడును.

సం/- **(ఎల్ఎమ్ శర్మ)**
ఎల్‌టి కల్నల్, ఎస్ఎస్‌డబ్ల్యూ
కమాండర్ వర్క్స్ ఇంజనీర్స్ తరపున

davp 10102/11/0328/1819


# సాయిబాబా చిన్న కథలు

వార్త 4లో...


# ప్రత్యేకాంధ్ర కోరుతూ సైకిల్ ర్యాలీ

**గిరిజన కాలనీలో రోడ్లు కాల్వల పనులకు శంకుస్థాపన**

**భీమిలి నియోజకవర్గ ఇంచార్జి విజయ్**



సింహాచలం : 72 వ వార్డు పరిధి అడివివరం నుంచి పాత గోశాలవరకు ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక హోదా కోరుతూ భీమిలి నియొజకవర్గ ఇంచార్జ్ సి హె చ్ విజయ్ ముఖ్య అతిథిగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో టిడిపి అర్బన్ ఉపాధ్యక్షులు పాశర్ల ప్రసాద్ టిడిపి నాయకులు కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రెశిడెంట్ కర్రి స్వామి టిడిపి నాయకుడు పిసిని వరహ నరసింహం టిడిపి నాయకులు లంక సత్తిబాబు, లండ శ్రీను, పంచదార్ల శ్రీను, లోగిశ గణేశ్, సతివాడ శంకరరావు, కాసు గోపాల్, మజ్జి సురిబాబు, ఇతర కార్యకర్తలు సైకిల్ త్రొక్కుతూ ప్రత్యేకాంధ్ర నినాదంతో ర్యాలీ చేశారు. అనంతరం గిరిజన కాలనీలో 20 లక్షల రూపాయలను శాంక్షన్ చేసిన గంటా శ్రీనివాసరావు అదేశాల మేరకు కాలనీకి కాల్వలు, రోడ్లు, అభివృద్ధి పనులను విజయ్ అతిథిగా శంకుస్థాపన కార్యక్రమం చేశారు.



# విజయభాను సంపాదకీయం

## పీడీస్తున్న నోట్ల కొరత!?

పెద్ద నోట్ల రద్దు కాలం నాటి చేదు జ్ఞాపకాలు మళ్లా ప్రజల అనుభవానికి వస్తున్నా, కేంద్ర ప్రభుత్వం మాత్రం అటువంటి సమస్యే లేనట్టు మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఏటీఎంలలో డబ్బు లేక ప్రజలు బేజారయిపోతున్నారు. ఇది మన రాష్ట్రంలోనే కాదు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇటువంటి సమాచారమే వస్తున్నది. తెలంగాణలోనే కాదు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్రపదేశ్, మధ్యప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాలలో నోట్ల కొరత పీడిస్తున్నది. కొన్ని నెలలుగా ఈ సమస్య ముదురుతూ వస్తున్నది. అయినా కేంద్రం సమస్య ఉన్నట్టు అంగీకరించడమే లేదు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ సమస్య లేదంటూనే ఉన్నట్టు పరోక్షంగా అంగీకరిస్తున్నారు. కరెన్సీ పరిస్థితిపై సమీక్ష జరిపామని, బ్యాంకులలో అవసరానికి మించిన కరెన్సీ అందుబాటులో ఉందని ఆయన అన్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో హఠాత్తుగా అసాధారణ స్థాయిలో ప్రజలు నోట్లు తీసుకోవడం వల్ల కొరత ఏర్పడి ఉండవచ్చునని ఆయనే అంటున్నారు. ఆర్బీఐ ధోరణి కూడా ఇందుకు భిన్నంగా లేదు. బ్యాంకుల్లో చాలినంత కరెన్సీ ఉన్నదనీ, అయినా నోట్ల ముద్రణ పెంచామని, రవాణా సమస్య వల్ల కొన్ని ప్రాంతాలలో కొరత ఏర్పడిందని ఆర్‌బీఐ చెబుతున్నది. అసాధారణ స్థాయిలో నోట్ల వినియోగం పెరిగినందువల్ల కొరత ఏర్పడిందనీ, ఐదు వందల రూపాయల నోట్లను ఐదింతలు ఎక్కువగా ముద్రిస్తున్నామని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్‌చంద్ర గార్గ్ తెలిపారు. నోట్ల కొరతే లేదని, అటువంటి సమస్య కొన్ని ప్రాంతాలలో తలెత్తడానికి హఠాత్తుగా ప్రజలు పెద్ద ఎత్తున డబ్బు తీసుకోవడమే కారణమని ఈ పెద్దలు అంటున్నారు. నోట్ల కొరత తీర్చడానికి తాము చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నట్టు నమ్మమంటున్నారు. కానీ వాస్తవం మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నది. గణాంకాలను తవ్వి తీస్తే, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నోట్ల చెలామణిని తగ్గించిందని రూఢీగా తెలుస్తున్నది. కొంతకాలంగా ఆర్‌బీఐ నోట్ల సరఫరాను తగ్గిస్తూ ఉన్నది. ఆర్‌బీఐ నుంచి తాము కోరిన మేర కనెన్సీ రావడం లేదని బ్యాంకులు లోపాయికారిగా అంగీకరిస్తున్నాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత రోజుకు పది వేల కోట్ల రూపాయల మేర చెలామణిలోకి వచ్చేది. అది క్రమంగా దాదాపు ఐదు వేల కోట్లకు పడిపోయింది. ఇప్పుడు పదిహేను వందల కోట్లకు తగ్గింది. ఇంతగా సరఫరా తగ్గిన తర్వాత నోట్ల కొరత ఏర్పడదా? ఒక సంస్థ సమాచార హక్కు చట్టం ప్రకారం పొందిన వివరాల ప్రకారం- తెలంగాణ రాష్ట్రంలోని ఎస్‌బీఐ శాఖలకు 2017 సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు నోట్ల సరఫరా మూడో వంతుకు తగ్గిపోయింది. దీన్నిబట్టి నోట్ల కొరతకు ఆర్‌బీఐ సరఫరా తగ్గించడమే కారణమని స్పష్టమవుతున్నది. బ్యాంకుల నుంచి ప్రజలు తీసుకున్న సొమ్మును తిరిగి జమచేయడం లేదనే మాట కూడా వినబడుతున్నది. అయితే దీనికి కారణం కూడా ప్రభుత్వ విధానమే. తాము బ్యాంకులో డబ్బు వేస్తే తిరిగి వస్తుందనే భరోసా ప్రజలకు లేదు. ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దుచేసిన నాటి నుంచి గ్రామీణులు చేతిలో రూకలు ఆడక చాలా ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ ఈ సమస్య తలెత్తింది. కేంద్రం క్రమంగా నోట్ల పాత్ర తగ్గించి, ప్రజలను ఆన్‌లైన్ లావాదేవీల వైపు నడిపిస్తున్నదనే అనుమానాలు ఇప్పుడు మరింతగా వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలను మాత్రమే అమలుచేయడం సాధ్యమా అనే విషయం ఎట్లా ఉన్నా, ప్రభుత్వానికి అటువంటి ఉద్దేశమే కనుక ఉంటే ఆ విషయాన్ని తేటతెల్లంగా చెప్పాలె. ప్రజాస్వామ్య వ్యవస్థలో రహస్య అజెండాలు ఉండకూడదు. పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని కూడా ప్రధాని హఠాత్తుగా ప్రకటించారు. దీనివల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఇంకా పడుతూనే ఉన్నారు. పెద్ద నోట్లను రద్దు చేసినప్పుడు, ఈ చర్య వల్ల నల్లధనం బయటికి వస్తుందని, ఉగ్రవాదుల ఆటకడుతుందని ప్రచారం సాగింది. కానీ ఇదంతా వట్టిదేనని తెలిసిపోయింది. ప్రభుత్వానికి ఉన్న అసలు ఉద్దేశం నోట్ల చెలామణిని తగ్గించడమే. కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ ఇప్పుడు నోట్ల సరఫరాను తగ్గిస్తూ కూడా ఆ విషయాన్ని బహిరంగంగా అంగీకరించడంలేదు. కానీ ప్రజలకు మాత్రం కేంద్ర ప్రభుత్వం నోట్లను తగ్గిస్తున్నదని అనుభవం ద్వారా అర్థమైంది. ప్రజలు నోట్లను దగ్గర పెట్టుకుంటున్నారనీ, బ్యాంకులలో వేయడం లేదని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారే అంటున్నారు. దీన్నిబట్టి ప్రజలకు ప్రభుత్వ విధానాలపట్ల భయాందోళనలు నెలకొన్నాయని అర్థమవుతున్నది. ప్రభుత్వ హామీల ను ప్రజలు విశ్వసించడం లేదు. బ్యాకింగ్ వ్యవస్థ మీద కూడా ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతున్నది. ఇది చాలా ప్రమాదకర పరిణామం.

## భాను కిరణ్‌కు ఏడాది జైలు, జరిమానా



హైదరాబాద్ : మద్దెల చెరువు సూర్యనారాయణ రెడ్డి అలియాస్ మద్దెల చెరువు సూరి హత్య కేసులో ప్రధాన నిందితుడు భాను కిరణ్‌కు కోర్టు ఏడాది జైలు శిక్ష, 10 వేల రూపాయల జరిమానా విధించింది. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నాడన్న కేసులో నిందితుడు భాను కిరణ్‌తో పాటు మరో ఇద్దరికి శిక్ష విధించింది. అక్రమ ఆయుధాలు, హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న భానును కొన్నేళ్ల కిందట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అక్రమ ఆయుధాల కేసు విచారణ అనంతరం న్యాయస్థానం భాను కిరణ్‌కు జైలుశిక్ష, జరిమానా విధించింది.

మద్దెల చెరువు సూరి హత్య కేసుకు సంబంధించి విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. సూరి హత్య కేసులో అరెస్టయిన భానుకిరణ్ ప్రస్తుతం జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే.

## సిద్ధ రామయ్యపై జనం కోపంతో ఉన్నారు : నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కర్ణాటకలోని ప్రజలు సిద్ధరామయ్య ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారు. ప్రభుత్వాన్ని మార్చాలనుకుంటున్నారు. గడచిన 48 నెలల్లో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేసింది. దీంతో ప్రతీ రంగంలోనూ మార్పులు సంతరించుకున్నాయి. కర్ణాటకలో బీజేపీ ప్రచారానికి వస్తున్న స్పందన చూస్తుంటే అక్కడ బీజేపీ ప్రభుత్వం ఖాయమని తెలుస్తున్నదని గడ్కరీ పేర్కొన్నారు. గడచిన నాలుగేళ్లలో మోదీ ప్రభుత్వ పథకాల కారణంగా అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తున్నదన్నారు. దేశంలోని 50 శాతం జనాభా బీజేపీకి మద్దతు పలుకుతున్నదన్నారు. కాగా దేశంలో ఈ ఏడాది గోధుమ, చెరకు ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. తద్వారా వీటి ధరలు తగ్గే అవకాశాలున్నాయి. మనదేశంలో నిధుల లేమి అనేది లేదు. అయితే నిజాయితీ పెరగాలి. ప్రభుత్వానికి చెందిన ఒక్క పైసా కూడా దుర్వినియోగం కాకుండా చూస్తున్నాం. దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతోందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

## దుఃఖాన్ని దిగమింగుకొని వికెట్లు తీశాడు



జైపూర్ : ఆకస్మాత్తుగా ఏదైనా చెడు వార్త వింటేనే తట్టుకోలేము.. ఇక అది మన కుటుంబ సభ్యుల గురించైతే..ఆ బాధ వర్ణనాతీతం. కానీ కింగ్స్ పంజాబ్ ఆటగాడు, ఆస్ట్రేలియా పేసర్ ఆండ్రూ టై దుఃఖాన్ని దిగమింగుకొని రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పాల్గొన్నాడు.ఈ మ్యాచ్‌లో ఆడటమే కాదు నాలుగు వికెట్లతో చెలరేగాడు. ఆండ్రూ టై నానమ్మ మరణించినట్లు మంగళవారం అతనికి కబురందింది. కానీ ఆటపట్ల శ్రద్ధతో ఏ మాత్రం కుంగుబాటుకు లోనుకానీ టై అద్భుత ప్రదర్శన కనబర్చాడు. దీంతో ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచి పర్పుల్ క్యాప్ అందుకున్నాడు. రాజస్తాన్ ఇన్నింగ్స్ అనంతరం తీవ్ర భావోద్వేగానికి లోనైన టై తన నానమ్మ మరణించిన విషయాన్ని తెలిపాడు. మా నానమ్మ ఇక లేరు. ఈ ప్రదర్శనను ఆమెతో నాకుటుంబ సభ్యులకు అంకితమిస్తున్నాను. ఇది నాకు భావోద్వేగపూరితమైన మ్యాచ్. నా జీవితంలో చాలా కఠినమైన రోజు. నేనెప్పుడు క్రికెట్‌ను ఇష్టపడుతాను. మా జట్టులో గొప్ప ఆటగాళ్లు ఉన్నారు. ఒక్కోసారి బ్యాట్స్‌మెన్ అద్భుతంగా రాణిస్తారు. కొన్నిసార్లు విఫలం అవుతారు. పిచ్ చాలా నెమ్మదిగా ఉంది. కొత్త బంతి మాకు అనుకూలించింది. అని వ్యాఖ్యానించాడు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత గౌతమ్‌ను ఔట్ చేసిన టై చివరి ఓవర్‌లో బెన్‌స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, ఉనద్కత్‌లను పెవిలియన్‌కు చేర్చాడు.

దీంతో రాజస్తాన్ 158 పరుగుల సాధారణ లక్ష్యమే నమోదు చేసింది. ఇక లక్ష్య ఛేదనలో కేఎల్ రాహుల్ మినహా పంజాబ్ బ్యాట్స్‌మన్ విఫలమవ్వడంతో రాజస్తాన్ 15 పరుగుల తేడాతో విజయం సాధించింది.

## ఏఎస్ఐ తీరుపై సుప్రీం సీరియస్

న్యూఢిల్లీ : చారిత్రక తాజ్ మహల్ కట్టడాన్ని సంరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంలో ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) విఫలమైందని సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజ్‌పై క్రిమి కీటకాలు ముసురుతున్నా దీన్ని నిరోధించేందుకు ఏఎస్ఐ సహా సంబంధిత అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని మండిపడింది. ఏఎస్ఐ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తే పరిస్థితి ఇలా ఉండేది కాదని వ్యాఖ్యానించింది. తాజ్ పరిరక్షణకు ఏఎస్ఐ అవసరమా, కాదా అనేది కేంద్రం నిర్ధారించాలని జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన సుప్రీం బెంచ్ కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ నాద్‌కర్ణితో పేర్కొంది. తాజ్‌మహల్ సంరక్షణ కోసం అంతర్జాతీయ నిపుణుల నియామకంపై సుప్రీం కోర్టు చేసిన సూచనలను పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని నాద్‌కర్ణి కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. యమునా నదిలో నీటి కొరత కారణంగానే క్రిమికీటకాల సమస్య తలెత్తిందని ఏఎస్ఐ న్యాయవాది కోర్టుకు నివేదించారు.కాగా తాజ్‌మహల్ పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరిస్తూ విజన్ డాక్యుమెంట్ ముసాయిదాను సమర్పించాలని ఈ ఏడాది మార్చిలో సుప్రీం కోర్టు యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. 1631లో మొఘల్ చక్రవర్తి షాజహాన్ తన భార్య ముంతాజ్ స్మృతిచిహ్నంగా నిర్మించిన ఈ చారిత్రక కట్టడం పరిరక్షణకు చేపడుతున్న చర్యలను సుప్రీం కోర్టు పర్యవేక్షిస్తోంది.

## కవి సమయం

### అప్పుడు-ఇప్పుడు

దేశం- ఎంతముందుకు పోతుందీ
ఒకసారి వెనుకకు చూస్తే;
కాలం-ఎంతవేగం పరుగులు తీస్తుంది
ఒకసారి ముందుకు చూస్తే;
డిగ్రీలు చదవాలంటే,
పట్టాలు పొందాలంటే;
దేశంలో ఏ మూలకోవెళ్ళి చదవాలి
పొయ్యి దగ్గర ఆకుమడిలా
కాలేజీలు వెళిసాయి ...॥దేశం॥
పొయ్యి మీదకు అన్నీ ఉన్నా!
పొయ్యి క్రిందకు కర్రలు లేకున్నా!
పస్తులుండవల్సిందే!
అవి-ఇవి లేకున్నా!
ఆడర్ ఇస్తే ఆహారపదార్థాలు
ఇంటికే వస్తున్నాయి ...॥దేశం॥
చచ్చే వారానికి -వార్త అందేది
ప్రాణం... పోగడ - మనష్యులు రాకడ
చిటికలోనే జరిగిపోతుంది ...॥దేశం॥
నీటి కోసం-ఏటికి
నిండు శూలాలు - దొంతే కూడలతో
పర్లాంగుల దూరం వెళ్లేది
పరుగులు తీస్తూ గంగమ్మ
ఇంటికి వస్తుంది ...॥దేశం॥
అమావాస్య-పౌర్ణమి
విడి-విడిగా కన్పించేవి
సౌర విద్యుత్ వచ్చి
పగలు-రాత్రి తేడా లేకుండా
వెలుగులు -జిలుగులు చేస్తుంది
...॥దేశం॥
లక్షా! కోటి మాట వినడమే తప్పా!
చూసేది లేదు
లక్షా! కోటి-డాలరు-మిలియన్స్
చూస్తున్నారు- గలా గలా ఆడిస్తున్నారు
...॥దేశం॥
నిన్న లేదు- మొన్న పెళ్లైనట్లుంది
అంత వేగంగాతేమిటి?
షష్టిపూర్తి ఏమిటి?
రిటర్నమెంట్ ఏమిటి?
ఏం అనుభవించానని--చ॥చా
...॥దేశం॥

రచన : ఎల్ సిద్ధూ
సెల్ నెం: 7702977293

## పంచాంగం

మాసం : ఛైత్ర ; తిథి: దశమి రా.7.47; శతభిషం ఉ.9.03; మ.వ.3.49ల 5.30. | గురువారం 10-05-2018

a **మేషం** : మంచి వ్యక్తులతో పరిచయాలు పెంచుకుంటారు. ఖర్చులు మీ రాబడికి తగినట్లుగానే ఉంటాయి. చేతివృత్తుల వారికి అంతంతమాత్రంగానే ఉంటుంది. కోర్టు వ్యవహారాలు, ఆస్తి తగాదాలు కొత్తమలుపు తిరుగుతాయి. స్పెక్యులేషన్ రంగాల వారికి సామాన్యం.

b **వృషభం** : ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఉమ్మడి వ్యాపారులకు ధన నష్టం కలిగే అవకాశం ఉంది. స్థిరచరాస్తుల విషయంలో జాగ్రత్త అవసరం. దంపతుల మధ్య అవగాహనా లోపం. రాజకీయ నాయకులు వాగ్దానాలు చేసి సమస్యలు తెచ్చుకోకండి. లాటరీ వ్యాపారస్తులకు సంతృప్తి కానవస్తుంది.

c **మిథునం** : బంధువుల రాకపోకలు సంతోషాన్ని కలిగిస్తాయి. రావలసిన మొండిబాకీలు సైతం వసూలు కాగలవు. లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. అనుకోని బకాయిలు వసూలవుతాయి. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం. ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించండి.

d **కర్కాటకం** : వృత్తి, ఉద్యోగాలందు ఉన్న వారికి ఆదాయం బాగుంటుంది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలు పరిష్కార దిశగా సాగుతాయి. మిత్రుల సహకారంతో కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. బాకీలు వసూలవుతాయి. సంఘంలో మీకు మంచి పేరు, ఖ్యాతి లభిస్తుంది. కుటుంబానికి మనశ్శాంతి లభిస్తుంది.

e **సింహం** : ఆర్థిక విషయాలలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ముఖ్యుల సహకారం వలన సమసిపోతాయి. కొత్తగా చేపట్టిన వ్యాపారాల్లో లాభాలు పొందుతారు. పాత సమస్యలు మీకు అనుకూలించగలవు. టెక్నికల్, కంప్యూటర్, ఎలక్ట్రానికల్ రంగాలలోని వారికి చికాకులు తప్పవు. నూతన పరిచయాలు ఏర్పడతాయి.

f **కన్య** : వృత్తి, వ్యాపార రంగాల వారికి అనుకూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి లాభం చేకూరుతుంది. ఆరోగ్యంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ నెమ్మదిగా సమసిపోతాయి. మీ కుమారుని మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం.

g **తుల** : వృత్తి, వ్యాపార రంగాల వారికి అనుకూలంగా ఉంటుంది. స్పెక్యులేషన్ రంగాల వారికి లాభం చేకూరుతుంది. ఆరోగ్యంలో చిన్న చిన్న సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ నెమ్మదిగా సమసిపోతాయి. మీ కుమారుని మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. వాహనం నడుపుతున్నప్పుడు జాగ్రత్త అవసరం.

h **వృశ్చికం** : ఉద్యోగస్తులకు పై అధికారులవల్ల ఒత్తిడి, చికాకులు ఎక్కువవుతాయి. విద్యార్థుల ఆలోచనలు పక్కదారి పట్టేందుకు ఆస్కారం ఉంది. అనవసరపు వివాదాల్లో తలదూర్చి సమస్యలు తెచ్చుకోకండి. స్థిరాస్తికి సంబంధించిన చర్చలు సత్ఫలితాలను ఇవ్వగలవు. ప్రైవేటు సంస్థల్లోని వారికి శ్రమకు తగిన ప్రతిఫలం కానవస్తుంది.

i **ధనుస్సు** : దంపతుల మధ్య చిన్న చిన్న అభిప్రాయబేధాలు తలెత్తుతాయి. అర్థాంతరంగా ఆపివేసిన పనులను పూర్తి చేస్తారు. ఆత్మీయుల నుంచి శుభాకాంక్షలు అందుకుంటారు. పీచు, నార, ఫోమ్, లెదర్ వ్యాపారస్తులకు మందకొడిగా ఉండును. మీ ఆంతరంగిక విషయాలను గోప్యంగా ఉంచటం మంచిది.

j **మకరం** : రావలసిన ధనం అందటంతో తనఖా పెట్టిన వస్తువులు విడిపించుకుంటారు. ఎదుటివారు మీ మాటలను తప్పుగా అర్థం చేసుకుంటారు. గృహంలో ఒక శుభకార్యం చేయాలనే ఆలోచన స్ఫురిస్తుంది. పిల్లలు, ప్రియతములతో కలసి విందులు, వేడుకలలో పాల్గొంటారు. స్త్రీలకు గుర్తింపు, రాణింపు లభిస్తుంది.

k **కుంభం** : స్త్రీలకు కాళ్లు, తల, నరాలకు సంబంధించిన చికాకులు అధికం అవుతాయి. చిట్స్, ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాల వారికి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం మంచిది. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండటం మంచిది.

L **మీనం** : సహోద్యోగులు, సన్నిహితులతో సమావేశం నిరాశాజనకంగా ముగుస్తుంది. సిమెంటు, ఇనుము, కలప వ్యాపారస్తులకు కలసిరాగలదు. స్త్రీలకు ఆరోగ్యంలో మెల కువ అవసరం. ఇప్పటిదాకా విరోధులుగా ఉన్న వ్యక్తులను సుముఖం చేసుకోగలుగుతారు.

# సాయిబాబా చిన్న కథలు



### ఆరాధన

ఉద్దాలకుడు పరుగు పరుగున పోయి చూడగా రాధ పటము వెనుక, అంతకు మునుపు చూడని గూడు కనబడింది. అక్కడ ఒక గుడ్డ పీలిక మూట వున్నది. ఆ మూట విప్పి చూచితే గాజుల వ్యాపారికి ఇవ్వవలసినంత పైకము మాత్రమే ఉన్నది. బయటకు వచ్చి వ్యాపారికి డబ్బు ఇచ్చాడు. వ్యాపారి "అయ్యా! ఆ అమ్మాయి మోసం చేసే వ్యక్తి కాదని నేను అనుకున్నాను. అదే నిజమయింది. ఆమె చెప్పినట్లే సొమ్ము దొరికింది. నాకు సెలవు ఇప్పించండి" అన్నాడు. ఉద్దాలకుడు గాజుల వ్యాపారి పాదములపై బడి "అయ్యా! ఎంత భాగ్యశాలివి. నా రాధా దేవి నీకు ప్రత్యక్షమై నీ చేత గాజులు తొడిగించుకున్నదా! ఆమె నా ఆరాధ్య దైవం. ఆమె నిన్ను నా వద్దకు పంపింది. ఆహా! నీవు ఆమెను నీవు కళ్ళారా చూశావు. రా! నాతో నదీ తీరానికి రా! నేను అమెను చూడాలి. ఆమె స్పర్శన, దర్శన, సంభాషణ భాగ్యం పొందిన నీవు ధన్యుడవు." అన్నాడు.


ఇరువురూ నదీ తీరం చేరి గట్టుపై నిలుచున్నారు. ఆమె ఎక్కడా కనిపించలేదు. ఉద్దాలకుని బాధ వ్యాపారి చూడలేకపోయినాడు. ఆ వ్యాపారి కంటి ధారలు కారుస్తూ నీటి వైపే చూస్తున్నాడు. హఠాత్తుగా మోచేతి వరకు మెరిసే గాజులతో ఒక దివ్య హస్తం పైకి లేచింది. ఉద్దాలకుడు ఆ సుందర హస్తాన్ని చూస్తూ పరవశించిపోయాడు. ! ఆ హస్తము నన్ను పిలుస్తూ ఉందా! లేదా అభయమిస్తున్నదా అనే దివ్యానుభూతికి లోనై " అమ్మా! అమ్మా!" అంటూ అక్కడే ప్రాణాలు వదిలాడు. అతని ఆత్మ శక్తి దివ్య జ్యోతిలో చేరిపోయింది. భక్తుని భావాకారమే భగవంతుని రూపం. ఆర్తితో, ఆవేదనతో ఏ రూపములో ఆరాధిస్తే, ఆ రూపముగానే భక్తునికి భగవంతడు దర్శనమిస్తాడు. అనుగ్రహిస్తాడు.

### కృష్ణ - తృష్ణ

ఒకసారి రుక్మిణి, సత్యభామ కృష్ణున్ని ఈ విధంగా ప్రశ్నించారు. "స్వామీ! ధర్మరాజు, భీష్మాచార్యులు వంటి మహనీయులుండగా, మీరెందుకు ఎప్పుడూ ద్రౌపదిని ప్రత్యకంగా చూస్తారు! ఆమె ఒక్క పిలుపునకు పలుకుతారు! అమె అంత భక్తులారా?" దానికి కృష్ణుడు చిరునవ్వుతో "ఎప్పుడో ఒక రోజు మీరే తెలుసుకుంటారులే ఆ రహస్యం" అని మెత్తగా జవాబిచ్చాడు. ఒక రోజు ద్రౌపదిని చూడడానికి శ్రీకృష్ణుడు రుక్మిణి, సత్యభామలతో వెళ్లాడు. అప్పుడు ద్రౌపది తన శిరోజములను విప్పి చిక్కు తీసుకుంటున్నది. ఆమె కేశములు కడు దీర్ఘములు. శ్రీకృష్ణుడు రుక్మిణీ, సత్యభామలతో "మా చెల్లెలు చిక్కు తీసుకోవడానికి చాలా శ్రమపడుతోంది. కొంచెం సహాయం చేయవచ్చు కదా.! అన్నాడు. వెంటనే వారిద్దరూ చెరొకపక్క నిలుచుకుని, కేశములను సగముగా చేసుకుని చిక్కు తీయడం ప్రారంభించారు. ఒక్కొక్క వెంట్రుక నుంచి " కృష్ణ , కృష్ణ అను శబ్దము వినచ్చినది. వారు సంభ్రమాశ్చర్యాలతో శ్రీకృష్ణుని వైపు చూచారు. ద్రౌపదికి కృష్ణునిపై ఉన్న అనన్య భక్తి అర్థమయింది అన్నట్లు చిరునవ్వులు చిందిస్తూ, ఏమీ తెలియని అమాయకుని వలే చూచూడా కృష్ణమూర్తి.

... సశేషం

## సంకీర్తన



# ఆడబిడ్డల రక్షణ అందరి బాధ్యత




అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం గ్రామ పంచాయతీ సర్పంచి శ్రీమతి రాజాల.గంగాభవాని ఆద్వర్యంలో ఆడబిడ్డల రక్షణ అందరి బాధ్యత అనే కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా శ్రీమతి రాజాల.గంగా భవాని మాట్లాడుతూ ఇటీవల కాలంలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు ఎక్కువగా ఉన్నాయని కావున అత్యాచారాలను ప్రతీ వ్యక్తి అరికట్టి వారికి రక్షణ కల్పించే దిశగా ప్రతీ ఒక్కరిలో చైతన్యం తీసుకురావాలని,అలాగే మానవత్వాన్ని మంట కలుపుతూ అకృత్యాలకు పాల్పడే కామాంధుల బారినంచి రక్షణ కల్పించ వలసిన భాద్యతలు అందరిపైన ఉన్నదని చెప్పారు.


ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బి.శ్రీనివాస్,మండల వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి.సత్తిబాబు, న్యాయవాది రాజాల.చిట్టి బాబు, మడ్డు.వీరబాబు, ప్రాధమిక ఆరోగ్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురంలో ప్రారంభమైన వైఎస్ఆర్‌సిపి ప్రచారం

పెద్దాపురం : రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్‌సిపి ప్రజా చైతన్య యాత్ర ద్వారా ప్రకంపనలు సృష్టిస్తున్నప్పటికీ పెద్దాపురం నియోజకవర్గంలో మాత్రం స్పందన లేకపోవడం ప్రజలలో గల నిరాఖ నిస్పృహలపై విలేఖర్లు అడిగిన ప్రశ్నకు ప్రముఖ రాజకీయనాయుకుడు, యువనేత, చలమలశెట్టి సునీల్ స్పందిస్తూ ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపధ్యంలో ప్రజలు కోరుతున్న మార్పుకు అనుగుణంగా నా రాజకీయం ప్రారంభంకాన్నుదని అన్నారు. ఒక కార్యక్రమానికి పెద్దాపురం విచ్చేసిన సునీల్ మాట్లాడుతూ తనను అన్ని పార్టీలవారు ఆహ్వానిస్తున్నారని నేను టిడిపి వెళ్తున్నట్లు వచ్చిన వార్తలు వదంతులు మాత్రమేనన్నారు.

పెద్దాపురంలో వైఎస్ఆర్‌సిపికి సమర్ధవంతమైన నాయకత్వం లోపం ఉన్నదని, ప్రజలకు పార్టీ ప్రణాళిక, యంత్రాంగం లోపించినదని, జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో, చలమలశెట్టి సునీల్ ద్వారా పెద్దాపురంలో ప్రజలకు మంచి నాయకత్వం ఇవ్వాలని కోరుతున్నామని సీనియర్ రాజకీయ నాయకుడు అత్తిలి సీతారామస్వామి అన్నారు. ప్రజల మనోభావా లను గుర్తించకుండా ఇతర ప్రాంతాలవారిని తెచ్చి ప్రజలపై మోపుతున్నారని, స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని గాలి దొరబాబు అన్నారు. ఈ సమావేశంలో సామర్లకోట వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్ జాన్‌మోజస్, తోటబాబు ఎంపిటిఐ, విజయభాస్కర్, కొత్తవీరన్న, బలిశెట్టి భీమన్నదొర, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. దీనితోపట్టణంలో ఇంతవరకు ఉనికి కోల్పోయిన వైఎస్ఆర్‌సిపి ఇతర పార్టీలకు ధీటుగా ప్రచారం ప్రారంభం కానున్నదని ఆనందం వ్యక్తంచేశారు

# నేడు మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి శంకుస్థాపన



పిఠాపురం : దక్షిణకాశీగా పేరుగాంచిన పిఠాపురం ఎంతో ఆధ్యాత్మిక విశేషముల గల దివ్యక్షేత్రము, ఇక్కడ శక్తి పీఠము, పాదగయ, పంచమాధవులల కుంతీమాధవస్వామి, శ్రీపాద వల్లభ జన్మస్థానమై ఎన్నో విధములుగా పవిత్రతను పొందిన పిఠాపురం నందు శ్రీ మహాలక్ష్మి ఆలయము శిలానిర్మాణము చేయాలని శ్రీ వాగ్దేవి ట్రస్ట్ సంకల్పించి, ఆలయ నిర్మాణం ప్రారంభించారు. పిఠాపురం సకేలేశ్వరస్వామి ఆలయం ప్రక్కన ఉన్న స్థలంలో ఆలయం నిర్మించేందుకు నేడు శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. గర్భాలయ, అంతరాలయములు శిలతో నిర్మించాలని వైదిక, ఆగమ పద్ధతులతో ఆలయ నిర్మాణము జరిపించాలని, ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు సహాయసహకారాలు అందించాలని శ్రీ వాగ్దేవి ట్రస్ట్ ఛైర్మన్ ఇంద్రకంటి వేంకట గోపాలకృష్ణ శర్మ తెలిపారు.

# ఎమ్మెల్యే వర్మ కోసం పడిగాపులు కాసిన ఉపాధి కూలీలు

## అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేను నిలదీసిన స్థానికుడు



పిఠాపురం : నవఖండ్రవాడ గ్రామంలో బుధవారం చేపట్టిన సైకిల్ ర్యాలీలో భాగంగా ఎమ్మెల్యేకు తీవ్ర అసంతృప్తి ఎదురైంది. ఉదయం 6గంటలకు సైకిల్ ర్యాలీ ఉందని గ్రామ ప్రజలందరు ఉపాధి కూలీ పథకాన్ని ఆపి వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. లేదంటే ఎమ్మెల్యేతో చెప్పి ఫీల్డ్ అసిస్టెంట్ పదవి నుంచి నిన్ను తప్పిస్తానని బెదిరింపుకు దిగండంతో చేసేదేమిలేక ఫీల్డ్‌అసిస్టెంట్ సైతం పార్టీ జెండాను భుజాన వేసుకున్నాడు. ఇదంతా నవఖండ్రవాడ గ్రామ సర్పంచ్ పిల్లి కృష్ణ కొంత మంది దళిత క్రైస్తవులను వెంటవేసుకుని కయ్యానికి కాలు దువ్వుతున్నట్లు గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా ఉపాధి మేటు బళ్ళ సురేష్ ఫీల్డ్ అసిస్టెంట్‌ని ఉపాధి పనులు ఎందుకు నిలిపివేశారని నిలధీయగా నాపై అధికారి ఎపిఓని అడగమని బదులిచ్చాడు. మండలంలోని ఎపిఓని వివరణ అడగ్గా మేము ఎవరిని పనులు మాన్పించలేదని తెలిపారు. ఎమ్మెల్యే సైకిల్ ర్యాలీ వల్ల ఉపాధి కూలీలలో ఉన్న నాయకులు పది మంది వరకూ వెళతారని మిగిలిన వారు పనిచేసుకోవాలని, లేకుంటే ర్యాలీ అయిన తరువాత పనిచేపడతారని తరువాత మస్తర్లు వేయడం జరుగుతుందని తెలిపారు. ర్యాలీ నిమిత్తం ఉదయం 6గంటల నుండి ఎమ్మెల్యే వచ్చే సమయం వరకూ సుమారు 3గంటలు ఎండలోనే ఉపాధి కూలీలు వేచిఉన్నారు. దీంట్లో ఉపాధి మేట్లు కొంతమంది సర్పంచ్ దగ్గర ఒకలాగా ఫీల్డ్ ఆఫీసర్ దగ్గర ఒకలాగా నక్క వినయం నటిస్తూ ఉండటంవల్లే పూటగడవని ప్రజలకు పనికోల్పోతున్నారని కొందరు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ గ్రామానికి కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశానని చెప్పగా స్థానికుడు ఎమ్మెల్యేను తాను చేసిన అభివృద్ధిని చూపించమని నిలధీశాడు. దీంతో కంగు తిన్న ఎమ్మెల్యే గతంలో నాయకులు చేసిన అభివృద్ధిని చూపించమని తిరిగి ప్రశ్నించాడు. ఇంతలో గ్రామ ప్రజలు అభివృద్ధి అంటే ప్రజల నుండి దోచుకుతినమేనని విసుగుచెందిన మహిళలు కార్యక్రమం నుండి వెనుదిరిగారు. ఇంతలో ఎమ్మెల్యే ఒక్క రెండు నిమిషాలు మాట్లాడి కార్యక్రమం ముగించేస్తానని చెప్పినా ఎమ్మెల్యే మాట వినకుండా మహిళలు, గ్రామ ప్రజలు అక్కడి నుండి వెళ్ళిపోయారు. సర్పంచ్ అవినీతికి పాల్పడుతున్నాడని ఎమ్మెల్యేకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందు వస్తున్న ఎన్నికలకు ఓట్ల కోసమే ఈ కల్లబొల్లి కబుర్లని చెబుతున్నారని దళితులకు అద్దాల మేడలు కట్టిస్తానని ఆశలు రేపుతున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు గడుస్తున్నా ఇప్పటివరకూ దళితులు అధికారులకు, నాయకులకు కనపడలేదా అని ప్రజలు విమర్శించారు. దమ్మున్టే అధికారులుగాని, ఎమ్మెల్యేగాని దళితులకు బ్యాంకులలో షూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని అప్పుడే దళితులు అభివృద్ధి చెందుతారని దళితుల యువజన నాయకుడు బళ్ళ సురేష్, పలువురు దళిత యువకులు ఎమ్మెల్యేకు హితవు పలికారు.

# కరెంట్‌షాక్‌కు వ్యక్తి బలి

యానాం : స్థానిక పైడికొండలవారి వీధిలో కార్‌షెడ్‌లో ప్రమాదవశాత్తు కరెంట్ షాకుకు గురై వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ వి. శివకుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో వీరభద్ర బస్సు సర్వీస్ కార్‌షెడ్‌లో కారును కడుగుతుండగా కరెంట్ షార్ట్ సర్క్యూట్ అయి అక్కడికక్కడ పడి మృతిచెందినట్లు తెలిపారు. మృత దేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని బందువులకు అప్పగించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# కేరళ రాష్ట్ర ఇంచార్జ్ జాతీయ ఉద్యానవన శాఖ డైరెక్టర్‌గా కృష్ణంరాజు



అన్నవరం: తూ.గో.జిల్లా తుని మండలం తేటగుంట గ్రామానికి చెందిన ప్రస్తుత జాతీయ ఉద్యానవన శాఖ డైరెక్టర్ గా ఉన్న చోడ్రాజు.సత్య కృష్ణంరాజును జాతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడు వీరేంద్ర సింగ్ మస్త్ ప్రస్తుత జాతీయ ఉద్యానవన శాఖ డైరెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్‌కి చెందిన చోడ రాజు సత్య కృష్ణంరాజుకు కేరళ రాష్ట్ర ఇంచార్జిగా బాధ్య తలు అప్పగించారు. ఆంధ్రప్ర దేశ్‌కి శంకర్ గౌర్ పాటిల్, కర్నాటకకు సుగుణాకర రావు నియమితులయ్యారు.

# సత్యదేవుని హుండీ ఆదాయం 42రోజులకు రూ.1కోటి 56 లక్షలు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు బుధవారం నిర్వహించారు. సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు 42 రోజులకుగానూ 1 కోటి 56 లక్షల 1 వేయి 930 రూపాయలు నగదు లభ్యం కాగా బంగారం 122 గ్రా., వెండి 990 గ్రా. భారీగా విదేశీ నగదు లభ్యం కాగా రికార్డు స్థాయిలో సత్యదేవుని హుండీల ఆదాయం లభించినట్లు దేవస్థానం ఈవో ఎమ్.జితేంద్ర తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, వ్రత పురోహితులు, పాలకమండలి సభ్యులు మరియు శ్రీ హరి సేవా సభ్యులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకన్న హుండియల్స్ ఆదాయం 36 లక్షలు

రావులపాలెం : కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండియల్స్ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. 37 రోజులకు గాను హుండి ఆదాయం 36 లక్షల 18 వేల 231 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉదయబాబునాయుడు, ఆలయ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఈఓ సత్యనారాయణరాజులు పాల్గొన్నారు.

# కోడి పందాలపై దాడి 8 మంది, ఐదుగురు పేకాట రాయుళ్ళ అరెస్ట్

రావులపాలెం: మండల పరిధి వెదిరేశ్వరంలో రహస్యం గా కోడి పందెం శిబిరంపై దాడి చేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే వెదిరేశ్వరం శివారు పంట పొలాల్లో రహస్యంగా కొంత మంది కోడి పందాలు ఆడుతున్నారన్న ముందస్తు సమాచారంతో ఎస్సై సిహెచ్ విద్యా సాగర్ తన సిబ్బందితో దాడి చేసి 8 మందిని అరెస్టు చేసి, వారి వద్దనుండి రెండు కోడి పుంజులు, 8200 సొమ్ము రికవరీ చేసినట్లు ఎస్సై తెలిపారు.

అలాగే స్థానికంగా గల పవర్ గెస్ట్ హౌస్ వద్ద గల ఖాళీ స్థలంలో రహస్యంగా పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసామని, ఈ దాడిలో పేకాట ఆడుతున్న 5గురిని అరెస్టు చేసినట్లు, వారి వద్దనుండి 5200 సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

# మంచినీటి చెరువులకు తాగునీట సరఫరా పరిశీలన

యానాం : కనకాలపేట ఫ్రెంచిఛానల్ కాల్వద్వారా మంచినీటి చెరువులకు తాగు నీటి సరఫరా జరుగుతున్న తీరు ప్రజాపనులశాఖ అధికారులు పరిశీలించారు. బుధవారం ఉదయం పిల్లంక కాలవ ద్వారా యానాంకు సరఫరా అవుతున్న తాగు నీటిని, కనకాలపేట, యానాం నల్లచెరువు, గోపాలనగర్ 53 ఎకరాల మంచినీటి చెరువులకు సరఫరాఅవుతున్న అంశాలపై ప్రజాపనుల శాఖ ఇఇ రాందాసు, ఎఇ మేడిశెట్టి శ్రీనివాసు, జెఇ వెంకన్నబాబు, తదితరులు పరిశీలించారు.

**పర్యాటక ప్రాంతాలలో మొక్కలకు నీటి సరఫరాలేక ఎండిపోతున్నాయి**

స్థానిక రాజీవ్ గాంధీ బీచ్‌లో ఏర్పాటుచేసిన వివిధ రకాల మొక్కలకు ప్రతీరోజు నీటి సరఫరాలేక ఎండిపోతున్నాయని దీన్ని పర్యవేక్ష ణకు నియమించిన సిబ్బంది ఏంచేస్తున్నారని పర్యాటకలు ప్రశ్నిస్తున్నారు. బీచ్ వెంబడి పర్యాటకులు వీక్షించేందుకు సరైన వృక్షాలులేక నిల్చుండే అవకాశాలు కనిపించడంలేదని దీనిపై సత్వరం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పర్యాటకులు సేదతీరెందుకు షెడ్‌లు నిర్మించా లని కోరారు. ప్రజా పసనులశాఖ ద్వారా ఏళ్ళతరబడి విధులు నిర్వహించకుండా వేతనా లు పొందుతున్న వారిపై సమగ్ర దర్యాప్తుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దీనికి సహకరిస్తున్న ఎఇ, జెఇలను తక్షణం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్‌బేడికి, ముఖ్యమంత్రి వి. నారాయణసామికి, చీఫ్ సెక్రటరీ మనోజ్‌పరిదాకు ఫిర్యాదుచేయనున్నట్లు తెలిపారు.

# ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలంటూ డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం




గాజువాక: తెదేపా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఏపీకి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలంటూ డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి బుధవారం క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. బుధవారం గాజువాక వైకాపా సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి ఆద్వర్యంలో గాజువాక ఎం.ఆర్.ఓ కార్యాలయాన్నికి ఎదురుగా ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 125అడుగుల విగ్రహాన్ని నెలకొల్పి, రూ.200 కోట్లతో స్మృతి వనం ఏర్పాటు చేస్తామని తెదేపా ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన వాగ్ధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వైకాపా పెద్దఎత్తున పోరాటం చేస్తుందని తెదేపా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు గుడివాడ అప్పలమూర్తి, పల్లచినతల్లి, రెడ్డిజగన్నాధం, చిత్రాడవెంకటరమణ, వెంపాడ అప్పారావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కరకచెట్టు పోలమాంబ దేవాలయం వద్ద ప్రత్యేక హోదా, రైల్వే జోన్ కోసం తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు కొబ్బరి కాయలు కొట్టి భారీ ర్యాలీ నిర్వహించారు.

# గౌతమి గోదావరి వద్ద 40 అడుగుల అంబేద్కర్ విగ్రహం

## శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి



రావులపాలెం : భారత దేశ ప్రజలు కీర్తించదగ్గ వ్యక్తి అంబేద్కర్ అని, అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడని శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో గౌతమీ గోదావరి నదీ తీరం వద్ద అంబేద్కర్ ఆశయ సాధన కమిటి ఆధ్వర్యంలో అంబేద్కర్ 40 అడుగుల విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం సర్వమత ప్రార్ధనలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి హాజరై మాట్లాడుతూ పుణ్యనది గౌతమీ గోదావరి తీరంలో రెండు బ్రిడ్జ్‌ల నడుమ భారతరత్న డా॥ బి.ఆర్ అంబేద్కర్ 40 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం కోనసీమకే తలమానికమని అన్నారు. ఇటువంటి మహోన్నతమైన వ్యక్తి విగ్రహం నెలకొల్పేందుకు ఏర్పాటు చేసిన శంఖుస్థాపన తన చేతులమీద జరగడం మహాద్భాగ్యమని, దేశ ప్రజలు స్వేచ్ఛగా, స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నారంటే అది అంబేద్కర్ చేసిన కృషి వల్లే అని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ అధ్యక్షులు డి.బి. లోక్, కోనసీమ దళిత ఐక్య వేదిక నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబురావు, పల్లి రాంబాబు, కర్రి నాగిరెడ్డి, జెడ్‌పిటిసి సాకా ప్రసన్న కుమార్, ఎమ్.పి.పి కోట చల్లయ్య, వైస్. ఎమ్.పి.పి దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, గొల్లపల్లి డేవిడ్ రాజు, తమ్మన శ్రీను, దొమ్మేటి అర్జునరావు, కనుమూరి శ్రీనివాసరావు, ముత్యాల వీరభద్రరావు, మద్దూరి సుబ్బలక్ష్మి బంగారం, గొలుగూరి మునిరెడ్డి, చల్లా ప్రభాకరరావు, పూలే అంబేద్కర్ ఆశయ సాధన సమితి సభ్యులు, బండారు రాజా, అమ్మన్న, బొక్కా వెంకటలక్ష్మి, అప్పారి విజయకుమార్, డా॥ గొలుగూరి వెంకటరెడ్డి (విక్టరి), మల్లిడి కనికిరెడ్డి, కర్రి అశోక్ రెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, కర్రి సుబ్బారెడ్డి, కొండేపూడి రామకృష్ణ, కర్రి వీర్రెడ్డి, జవ్వాది రవిబాబు, బొక్కా ప్రసాద్, పినపళ్ల ఎమ్.పి.టి.సి ఉమాదేవి, వత్సవాయి కృష్ణంరాజు, మన్యం భాను, షేక్ వల్లీ బాబా, కప్పల వరప్రసాద్ (సి.ఆర్), గొల్లపల్లి శ్రీధర్, కప్పల శ్రీధర్, కప్పల నాగేశ్వరరావు, మల్లిడి అంజనీకుమార్ రెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, కుడుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి రామకృష్ణ, ద్వారంపూడి సుధాకరరెడ్డి, అంబటి గోపి, అంబేద్కర్ ప్రాంగణ నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

# మహానటి

## రివ్యూ

మీరెలాంటి పాత్రలు చేయాలనుకుంటున్నారు? అని ఏ కథానాయికనైనా, ప్రశ్నిస్తే.. 'గ్లామర్ రోల్స్‌తో పాటు, సావిత్రిలా నటనకు ప్రాధాన్యం ఉన్న ఒక్క పాత్రనైనా నా కెరీర్‌లో చేయాలనుకుంటున్నా'. దాదాపు అందరు కథానాయికలూ చెప్పే సమాధానం ఇదే. తరాలు మారినా చెరిగిపోని, మాసిపోని, మెరుపుపోని నటనా చాతుర్యం ఆమెది. కళ్లతోనే హావభావాలు పలికించగలిగిన అతి కొద్దిమంది నటీమణుల్లో సావిత్రిది అగ్రస్థానం అనడంలో ఎలాంటి సందేహం లేదు. తొలితరం కథానాయికల తర్వాత తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో ఓ వెలుగు వెలిగిన ధ్రువతార సావిత్రి. ఆమె కన్నా ముందు చిత్ర పరిశ్రమలో చాలా మంది కథానాయికలు ఉన్నారు.. ఆ తర్వాత చాలా మంది వచ్చారు.. కానీ, సావిత్రి మాత్రమే 'మహానటి' అయ్యారు. అంతటి గొప్ప నటీమణి జీవితం ఆధారంగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రం 'మహానటి'. నటీనటుల ఎంపిక దగ్గరి నుంచి ప్రచార చిత్రాల వరకూ ప్రతిదీ విభిన్నంగా తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి బుధవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఎలా ఉంది? సావిత్రిగా టైటిల్ రోల్ పోషించిన కీర్తిసురేష్ ఏ మేరకు ఆకట్టుకుంది? అతిరథ మహారథులు పోషించిన అతిథి పాత్రలు ఎలా ఉన్నాయి?

కథేంటంటే: బెంగళూరులోని చాళుక్య హోటల్‌లో తీవ్ర అనారోగ్యం పాలై కోమాలోకి వెళ్లిపోయిన సావిత్రి (కీర్తి సురేష్)ను ఆస్పత్రిలో చేరుస్తారు. ఆవిడ సాధారణ మహిళ అనుకొని అందరు పేషెంట్లలాగే చూస్తారు. అయితే, ఆమె 'మహానటి' సావిత్రి అని తర్వాత తెలుస్తుంది. అభిమానులు ఆస్పత్రికి పోటెత్తుతారు. అప్పటి నుంచి ఏడాది పాటు ఆమె కోమాలోనే ఉండిపోతుంది. ఆ సమయంలోనే ప్రజావాణి పత్రికలో విలేకరిగా చేరుతుంది వాణి(సమంత). ఆమెకు సావిత్రి కథ రాసే బాధ్యతను అప్పగిస్తారు. ఫొటో జర్నలిస్ట్ విజయ్ ఆంటోనీ(విజయ్ దేవరకొండ)తో కలిసి ఆమె పరిశోధన మొదలు పెడుతుంది. కోమాలోకి వెళ్లడానికి ముందు సావిత్రి జీవితంలో చోటు చేసుకున్న సంఘటనలు ఏంటి? బెంగళూరులో శంకరయ్యను కలవడానికని వెళ్లిన సావిత్రికి ఏం జరిగింది? అసలు శంకరయ్య ఎవరు? తదితర విషయాలను మధురవాణి ఎలా వెలుగులోకి తీసుకొచ్చిందనేది 'మహానటి' చిత్రం.

ఎలా ఉందంటే: తరతరాలుగా గుర్తుండిపోయే నటి సావిత్రి. అదే స్థాయిలో తెరకెక్కిన చిత్రమే 'మహానటి'. సావిత్రి జీవితాన్ని పలు రచనలు రకరకాల కోణాల్లో ఇప్పటికే ఆవిష్కరించాయి. అయితే నవ తరానికి కూడా ఆమె జీవితం గురించి తెలిసేలా, తెలిసిన వాళ్లు కూడా మరొకసారి ఆమెకు సంబంధించిన








జ్ఞాపకాలను నెమరేసుకునేలా అందంగా తెరకెక్కించిన చిత్రమే మహానటి. జీవిత కథల్ని తెరకెక్కించాలంటే తగిన పరిశోధన అవసరం. వాస్తవికత ఉట్టిపడుతూనే ఆయా కథల్లో తగిన డ్రామా పండాలి. ఆ నేపథ్యం కూడా తెరపై పక్కాగా కనిపించాలి. ఆ విషయంలో దర్శకుడు. నూటికి నూరుపాళ్లు విజయం సాధించాడు. సావిత్రి వ్యక్తిగత జీవితంతో పాటు, ఆమె నట జీవితం లోతుల్లోకి తొంగిచూసి కథను రాసుకున్నాడు దర్శకుడు. 'ఒక కంట్లో నుంచే కన్నీళ్లు రావాలని, అది కూడా రెండు చుక్కల కన్నీరే కార్చాలని దర్శకుడు కేవీ రెడ్డి చెప్పడం.. సావిత్రి గ్లిజరిన్ వాడకుండా రెండంటే రెండు చుక్కలే కన్నీళ్లు కార్చే సన్నివేశంతో మొదలు పెడితే ఆద్యంతం సినిమా కూడా ప్రేక్షకుల కళ్లు చెమ్మగిల్లేలా చేస్తుంది. దశాబ్దాల నట ప్రయాణం.. 300 సినిమాలతో కూడిన సుదీర్ఘ ప్రయాణం సావిత్రిది. ఆ జీవితం మొత్తాన్ని ఒక సినిమాలో చూపించాలంటే సాహసంతో కూడుకున్న పనే. కానీ, దర్శకుడు తెలివిగా సావిత్రి బాల్యం మొదలుకొని, ఆమె జీవితంలో ఏ దశను వదిలి పెట్టకుండా తెరపై ఆవిష్కరించాడు.

తొలి సగభాగంలో బాల్యంతో పాటు, నాటకజీవితం, సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు, నటిగా ఎదిగే క్రమం, ప్రేమ, పెళ్లి వరకూ చూపించారు. చాలా సన్నివేశాలు సరదాగా మరికొన్ని సన్నివేశాలు హృద్యంగా సాగుతూ ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. తను అనుకొన్నది సాధించేవరకూ వదలిపెట్టని సావిత్రి నైజాన్ని చూపించిన విధానం ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో జెమినీ గణేశన్‌తో కలిసి జీవితాన్ని మొదలు పెట్టడం, పెళ్లి తర్వాత కూడా ఆమె నటిగా ఓ వెలుగు వెలగడం ఆ తర్వాత వైవాహిక జీవితంలో కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యసనాలు తదితర విషయాలను చూపించారు. వీటన్నింటి మధ్యలోనే ఆమె నటనా వైభవాన్ని 'మాయాబజార్', 'మిస్సమ్మ', 'మూగ మనసులు' తదితర చిత్రాల్లోని ఘట్టాలతో చూపించిన విధానం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. విజయ్ ఆంటోనీ, వాణి పాత్రల్లో సావిత్రి పాత్రను ముందుకు నడిపించిన విధానం దర్శకుడి ప్రతిభకు నిదర్శనం. పతాక సన్నివేశాల్లో సమంత నటన, ఆమె మాటలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. మొత్తంగా సావిత్రి జీవితానికి గొప్ప నివాళిలా నిలిచే చిత్రమిది.

ఎవరెలా చేశారంటే: సావిత్రిగా కీర్తి సురేష్ నటించారు అనడం కంటే జీవించారు చెప్పాలి. లుక్ పరంగా బ్లాక్ అండ్ వైట్ షేడ్స్‌తో కూడిన సన్నివేశాల్లో అచ్చం సావిత్రిలానే కనిపించారు. సావిత్రి నటనను అనుకరించిన విధానం, ఆమె హావభావాలను పక్కాగా ఒంట బట్టించుకొని నటించిన వైనం చిత్రానికి ప్రాణం పోసింది. జెమినీ గణేశన్‌గా దుల్కర్ సల్మాన్ చాలా బాగా నటించారు. 'కాదల్ మన్నన్'గా గుర్తింపు పొందిన జెమినీ శైలిలోనే దుల్కర్ హావభావాలను ప్రదర్శించాడు. ఆ పాత్ర కొన్ని చోట్ల వ్యతిరేక ఛాయలతో సాగుతున్నట్లు అనిపించినా, దర్శకుడు చివరికి వచ్చే సరికి పరిస్థితులే విలన్ అన్నట్లు చూపించడం బాగుంది. సావిత్రి పెదనాన్న పాత్రలో రాజేంద్రప్రసాద్, తల్లి పాత్రలో దివ్యవాణిల అభినయం ఆకట్టుకుంటుంది. పాత్రికేయురాలు మధుర వాణిగా సమంత, ఆమెకు సాయం చేస్తూనే ఆమెను ప్రేమించే ఫొటో జర్నలిస్ట్ విజయ్ ఆంటోనీగా విజయ్ దేవరకొండ ప్రశంసలు పొందే స్థాయిలో నటించారు. ఎస్వీ రంగారావుగా మోహన్‌బాబు కనిపించేది కొన్ని సన్నివేశాల్లోనైనా, ఆయన పాత్ర ప్రేక్షకులపై చక్కని ప్రభావం చూపిస్తుంది. ఏయన్నార్‌గా నాగచైతన్య తళుక్కున మెరుస్తారు. ఎన్టీఆర్ పాత్ర కూడా ఓ సన్నివేశంలో అలా మెరిసి, అభిమానులను అలరిస్తుంది. సావిత్రి జీవితాన్ని ప్రభావితం చేసిన నిన్నటితరం సినీ ప్రముఖులు కేవీ రెడ్డి, ఎల్వీ ప్రసాద్, చక్రపాణి పాత్రల్లో క్రిష్, అవసరాల శ్రీనివాస్, ప్రకాష్‌రాజ్‌లు కనిపిస్తారు. భానుప్రియ, నరేశ్, తనికెళ్ల భరణి, షాలిని పాండే, మాళవికా నాయర్, తులసి తదితరులు ఆయా పాత్రల పరిధిమేరకు చక్కగా ఒదిగిపోయారు.


సాంకేతికంగా..: సాంకేతికంగా ఈ సినిమాకు నూటికి నూరు మార్కులు పడతాయి. తోట తరణి నేతృత్వంలో శివం రావు, అవినాష్‌లు ఆకాలం నాటి నేపథ్యాన్ని.. అందుకు సరిపోయే చక్కటి వాతావరణం సృష్టించారు. మిక్కీ జె.మేయర్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం థియేటర్ నుంచి బయటకు వచ్చాక కూడా వెంటాడతాయి. 'మూగ మనసులు' 'మహానటి' పాటలు తెరపై చిత్రీకరించిన విధానం కూడా బాగుంది. డానీ కెమెరా పనితనం సినిమాకు జీవం పోసింది. కొన్ని బ్లాక్ అండ్ వైట్ సన్నివేశాలను చాలా బాగా తీర్చిదిద్దారు. ఆరోజులను గుర్తు చేసేలా రీల్ కెమెరాతో కొన్ని సన్నివేశాలను తీర్చిదిద్దిన విధానం సినిమాకు సహజత్వాన్ని తెచ్చి పెట్టింది. దర్శకుడు నాగ్ అశ్విన్ కథను అల్లిన విధానం సన్నివేశాలను తెరపైకి తీసుకొచ్చిన విధానం ఆయన అభిరుచికి, ప్రతిభకు అద్దం పడతాయి. సాయిమాధవ్ బుర్రా మాటలు ప్రేక్షకులతో చప్పట్లు కొట్టిస్తాయి. 'ప్రతిభ ఇంటి పట్టునే ఉండిపోతే ప్రపంచానికి పుట్టగతులు ఉండవు' వంటి సంభాషణలు సినిమాలో చాలానే వినిపిస్తాయి. నిర్మాతలు స్వప్నదత్, ప్రియాంక దత్ కలకు, తపనకు, అభిరుచికి తార్కాణంగా నిలుస్తుంది చిత్రం. వైజయంతీ మూవీస్ స్థాయి నిర్మాణ విలువలు ఎక్కడా తగ్గకుండా వాళ్లు 'మహానటి'ని నిర్మించారు.

# 233.64 కోట్ల అంచనా..... సంపూర్ణేష్ బాబు సంచలనం!



'బిగ్ బాస్' తెలుగు ఫస్ట్ సీజన్ పూర్తయిన తర్వాత సంపూర్ణేష్ బాబు సందడి తగ్గింది. ఈ మధ్య కాలంలో ఆయన తెలుగు తెరపై కనిపించక పోవడం, ఎప్పుడూ ఏదో ఒక సెన్సేషన్‌తో వార్తల్లో ఉండే ఆయన కొన్ని రోజులుగా సైలెంట్ అయిపోవడమే అందుకు కారణం. ఈ రోజు సంపూర్ణేష్ బాబు పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన నటిస్తున్న 'కొబ్బరిమట్ట' చిత్ర బృందం బర్త్ డే పోస్టర్ విడుదల చేశారు. సమ్మర్ రిలీజ్‌గా ఈ సినిమా ఉండబోతోందని అందులో పేర్కొనబడి ఉంది. అంతే కాదు.... ఈ సారి మా సినిమా తెలుగు సినిమా రికార్డులన్నీ బద్దలు కొట్టడం ఖాయం అంటూ ప్రకటించుకోవడం గమనార్హం. 'కొబరిమట్ట' సినిమా రాబోతోంది. తెలుగు సినిమా చరిత్రలో ఇప్పటి వరకు ఉన్న రికార్డులన్నింటినీ తిరగ రాస్తుంది. తొలివారం మా చిత్రం రూ. 233.64 కోట్లు వసూలు చేస్తుందని అంచనా వేస్తున్నాం అంటూ ప్రమోషన్ పోస్టర్ విడుదల చేయడం హాట్ టాపిక్ అయింది. థాంక్స్ చెప్పిన సంపూ తన పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్ డిజైన్ చేసి విడుదల చేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ...... చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ తన అఫీషియల్ ఫేస్ బుక్ పేజీలో ఓ పోస్టు పెట్టారు. మూడు పాత్రల్లో సంపూర్ణేష్ బాబు ఈ చిత్రంలో సంపూర్ణేష్ బాబు మూడు పాత్రల్లో కనిపించబోతున్నారు. పెదరాయుడు, పాపారాయుడు, ఆండ్రాయుడు పాత్రల్లో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ సినిమా గురించి గతంలో సంపూ మాట్లాడుతూ.... 'కొబ్బరి మట్ట' ఒక కుటుంబ కథా చిత్రం... నా దృష్టిలో కుటుంబం అంటే ఒక పాక, భార్య అంటే నచ్చి తెచ్చుకునే తవుడు, ఇక పిల్లలు అంటే మన ఇష్టంతో కలుపుకునే కుడితి.... కానీ నా దృష్టిలో తండ్రి అంటే పాలిచ్చే మగ ఆవు. గొప్ప సెంటిమెంట్ ఈ సినిమా రాబోతోంది అని వ్యాఖ్యానించారు. ఈ చిత్రానికి నిర్మాత: ఆది కుంభగిరి, కథ-స్క్రీన్ ప్లే, మాటలు: స్టీవెన్ శంకర్, కూర్పు : కార్తీక శ్రీనివాస్, స్టంట్స్: జాషువ, సంగీతం: కమ్రన్, లైన్ ప్రొడ్యూసర్: సురేష్, దర్శకత్వం: రూపక్ రొనాల్డ్ సన్.

# హీరో రవితేజ దిమ్మదిరిగే డీల్



మైత్రి మూవీ మేకర్స్... ఈ పేరు టాలీవుడ్లో ఇపుడు మార్మోగి పోతోంది. శ్రీమంతుడు, జనతా గ్యారేజ్, రంగస్థలం.... ఇలా ఒకదాన్ని మించి మరొకటి హిట్ కొడుతూ హాట్రిక్ కొట్టిన ఈ సంస్థ నెక్ట్స్ రవితేజ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం మైత్రి మూవీస్ వారు మాస్ మహారాజతో కుదుర్చుకున్న డీల్‌కు సంబంధించిన వివరాలు బయటకు లీక్ అయ్యాయి. రెండు సినిమాలకు కలిపి రూ. 16 కోట్లకు అగ్రిమెంట్ జరిగిందని ఫిల్మ్ నగర్లో హాట్ టాపిక్ నడుస్తోంది. ప్రస్తుతం కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో 'నేల టికెట్' చేస్తున్న రవితేజ..... దీని తర్వాత శ్రీను వైట్ల దర్శకత్వంలో 'అమర్ అక్బర్ ఆంటోనీ' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమా తర్వాత కందిరీగ ఫేం సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వంలో మరో ప్రాజెక్టుకు కమిట్మెంట్ ఇచ్చారు. శ్రీను వైట్ల, సంతోష్ శ్రీనివాస్‌తో రవితేజ చేస్తున్న రెండు సినిమాలను మైత్రి మూవీ మేకర్స్ వారు నిర్మిస్తున్నారు. రెండు సినిమాలకు కలిపి రవితేజ రూ. 20 కోట్లు అడిగినట్లు సమాచారం. అయితే మైత్రి మూవీ మేకర్స్ అధినేతలైన నవీన్ యర్నేని, వై రవి శంకర్, సివి మోహన్ కలిసి చర్చలు జరిపి రూ. 16 కోట్లకు డీల్ సెటిల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ మధ్య సరైన హిట్స్‌లేని రవితేజ 'రాజా ది గ్రేట్' సినిమాతో మళ్లీ ఫాంలోకి వచ్చాడు. అయితే ఆ తర్వాత వచ్చిన 'టచ్ చేసి చూడు' మూవీ నిరాశ పరిచింది. అయితే ఈ సారి అభిమానులను మెప్పించే ఫుల్ మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నేల టిక్కెట్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఈ సినిమా ద్వారా రవితేజ బాక్సాఫీసుపై విజృంభిచండం ఖాయం అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# నాకు మాత్రమే దక్కిన అదృష్టం..



లెజెండ్రీ నటి సావిత్రి బయోపిక్ మహానటి చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మెగాస్టార్ చిరంజీవి కూడా స్పందించారు. మహానటి చిత్రం కోసం అటు అభిమానులు, ఇటు ఇండస్ట్రీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఆ క్షణం రానే వచ్చింది. నేడు మహానటి చిత్రం ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా రిలీజ్ అవుతోంది. కీర్తి సురేష్, దుల్కర్ సల్మాన్, సమంత, విజయ్ దేవర కొండ ఈ చిత్రంలో ప్రధాన పాత్రల్లో నటించారు. మెగాస్టార్ చిరంజీవి ఓ వీడియో బైట్ ద్వారా సావిత్రితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తెలుగు చలన చిత్ర రంగంలో సావిత్రికి ప్రత్యేక స్థానం ఉంటుంది. నటీమణులు ఎందరో ఉన్నారు కానీ సావిత్రి మాత్రమే మహానటి అని మెగాస్టార్ అన్నారు. మెగాస్టార్ చిరంజీవి నటించిన తొలి చిత్రం పునాదిరాళ్ళు. ఆ చిత్రం ద్వారా తనకు మాత్రమే ఓ అదృష్టం దక్కిందని చిరు అన్నారు. తన సినీ జీవితానికి పునాది వేసిన పునాదిరాళ్ళు చిత్రంలో సావిత్రమ్మతో నటించానని అన్నారు. తొలి చిత్రంలోనే ఆమెతో నటించడం మరచిపోలేని అనుభూతి అని అన్నారు. గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్లు రప్పించగల సహజనటి సావిత్రి మాత్రమే అని చిరు అన్నారు. కళ్ళతోనే అద్భుతమైన హావభావాలు పలికించడం, తాను కదలకుండా కథని నడిపించగలగడం సావిత్రమ్మ ప్రత్యేకతలని చిరు అన్నారు. నటిగా, వ్యక్తిగా, అమ్మగా సావిత్రమ్మ ఈ చిరంజీవి మనసులో ఎప్పటికి చిరంజీవిగానే ఉంటుందని మెగాస్టార్ అన్నారు. సావిత్రి బయోపిక్ ద్వారా ఆమె చరిత్రని తెలియజేసే ప్రయత్నం చేస్తున్న మహానటి చిత్ర యూనిట్ కి చిరు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ చిత్రం అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# ఎనిమిదవ రోజు సంఘీభావ యాత్ర



విశాఖపట్నం : వైఎస్ఆర్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంకల్ప యాత్రకు సంఘీభావంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి , రాజ్యసభ సభ్యుడు వి. విజయ సాయి రెడ్డి చేస్తున్న సంఘీభావ యాత్ర బుధవారం ఎనిమిదవ రోజు సాగింది. ఈ పాద యాత్ర విశాలాక్షి నగర్ వద్ద ప్రారంభమై జోడుగుళ్ళ పాలెం మీదుగా అప్పుఘర్ , ఎమ్ వి పి కోలనీ కేన్సర్ ఆసుపత్రి , తితిదే కల్యాణమండపం, ఆదర్శ నగర్ , రామలక్ష్మణ అపార్టెమెంట్ జంక్షన్ , శివాజీ పార్క్ , ఆరు కొళాయిల జంక్షన్ , పీతలవానిపాలెం , తారా మసీద్ వీధి, డాక్టర్ల కోలనీ , పేద వాల్తేరు, గాంధీ సెంటర్ , జాలారిపేట మీదుగా జిసిసి ఆఫీస్ , ఈస్ట్ పోయింట్ చిన వాల్తేరు , ఓల్డ్ సీబీఐ రోడ్ , ఏ యు రోడ్ , సిరిపురం , సంపత్ వినాయక్ టెంపుల్ , జివిఎంసి ఆఫీస్ రోడ్ , రామ్ నగర్ బజార్ వద్దకు చేరుకొని అక్కడ బహిరంగ సభ నిర్వహించారు . పేద వాల్తేరులో పార్టీ కార్యకర్త మంగరాజ ఇంటి వద్ద మధ్యాహ్న భోజనం స్వీకరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు విశాఖ పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ డాక్టర్ మళ్ళ విజయప్రసాద్, విశాఖ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు , మాజీ ఎంఎల్ఎ తైనాల విజయకుమార్, అనకాపల్లి పార్లీమెంటరీ పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్ నాథ్, నియోజకవర్గం సమన్వయకర్తలు వంశీకృష్ణ శ్రీనివాస్ , గురువులు , సిఇసి సభ్యులు శ్రీకాంత్ రాజు, అదనపు కార్యదర్శులు దివాకర్ , రవిరెడ్డి, ఫరూఖి , నాయకులు వాసు గౌడ్, రామన్న పాత్రుడు, బరకత్ఆలీ , కొండా రాజీవ్, బోని శివరామకృష్ణ , అప్పారి గిరిబాబూ , మొల్లి అప్పారావు, కృష్ణంరాజు , పేర్ల విజయ చందర్ ,పీతల మూర్తి యాదవ్ , తదితరులంతా పాల్గొన్నారు. ఈ యాత్రలో ముఖ్య అతిధులుగా పూతల పుట్టు ఎమెల్యే సునీల్ , అధికార ప్రతినిధి అంబటి రాంబాబు , మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణ పాల్గొన్నారు.





## ఘనంగా పశ్చిమ ఎమ్మెల్యే
# గణబాబు జన్మదిన వేడుకలు





గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ పెతకం శెట్టి గణబాబు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా పార్టీ కార్యకర్తలు నాయకులు, ఆయన అభిమానులమధ్య ఆయన స్వగృహంలో ఘనంగా జరిగింది. ఆయన పుట్టిన రోజు పురస్కరించుకుని గొపాలపట్నం రోడ్లకి ఇరువైపుల ఆయన అభిమానులు భారీ కటౌట్లు ఏర్పాటుచేశారు పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన నియోజకవర్గం నలుమూలలనుంచి భారీగా కార్యకర్తలు అభిమానుల చేరుకుని భారీ గజమాలలు, పుష్పగుచ్ఛములు అందజేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

ఆయన స్వగృహానికి భారీగా మహిళలు చేరుకుని ఆయనకు శుభాకంక్షాలు తెలియజేశారు ఆయన పుట్టినరోజు పురస్కరించుకుని 66వ వార్డు అద్యక్షుడు బొడ్డేటి విజయకుమార్, వార్డు కార్యకర్తలు మహిళలతో బారీగా గణబాబు స్వగృహానికి చేరుకుని ముందుగా సిద్ధం చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యేతో కట్ చేయించి ఆయనకు తినిపించారు

వీరితో పాటుగా ఈ కార్యక్రమంలో ఐతం శెట్టి కొటేశ్వరరావు (పి ఏ సి ఎస్ చైర్మన్ , )68 వ వార్డు ప్రెశిడెంట్ నరిపల్లి సతీశ్ రాజు, దొడ్డి చంద్రశేఖర్, ఇతరనాయకులు పాల్గొన్నారు వీరితో పాటుగా సింహచలం సింహగిరి వర్తక సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపి అప్పన్న ప్రసాదం అందజేశారు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం అల్పాహారం పంపిణి జరిగింది. పేద వృద్దులకు నగదు, బట్టలను పంపిణీ చేశారు.



## నేడు అభయాంజనేయ స్వామి
# విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



అనకాపల్లి : కశింకోట మండలంలోని చింతలపాలెం పంచాయితీ నర్సింగబిల్లిలో ఏర్పాటు చేసిన 18 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని గురువారం వేదపండితుల మంత్రోచ్ఛారణల మద్య ప్రతిష్టించనున్నట్లు నిర్వాహకులు బుద్దిరెడ్డి చిన్న, మాలతి దంపతులు తెలిపారు. సుమారు రూ. 15 లక్షలు వెచ్చించి ఈ ఆలయాన్ని నిర్మించారు. విఘ్నేశ్వర పూజ, భగవత్ పున్యవహాసం, రుత్విక్ వరుణ, రక్షా సూత్రధారణ, దీక్షధారణ అగ్నిమదనం, అగ్ని ప్రతిష్టాపన, హెూమాలు జలధివాసనము మొదలగు పేరుతో ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. వేణుగోపాలస్వామి వ్యవస్థాపక చైర్మన్ రాజేటి రామాచార్యులు మారుతి విద్యాపీటం పండితులు రాజేటి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని తెలిపారు. అలాగే మద్యాహ్నం 12 గంటలకు బారీ అన్నసమారాధన ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్న, శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ, పారిశ్రామిక వేత్త పరుచూరి భాస్కరరావు, వైసీపీ జిల్లా నాయకులు గుడివాడ అమర్‌నాధ్, కరణం ధర్మశ్రీ, దంతులూరి దిలీప్‌కుమార్, ఆర్ఈసిఎస్ చైర్మన్ మలసాల రమణరావు, తదితర ముఖ్య నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమానికి భక్తులు యావన్మంది హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.




# అపోలో ఆధ్వర్యంలో యాంజీయో ప్లాస్టీపై వర్క్‌షాప్



విశాఖపట్నం : విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో కరోనరీ ఇమాజింగ్‌తో కాంప్లెక్స్ కోరినరీ యాంజీయో ప్లాస్టీపై వర్క్‌షాప్‌ను నిర్వహించింది. నగరంలోని ప్రముఖ కార్డియోలజిస్టులు సహా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు కార్డియాలజిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. అందులోని కాంఫిల్ హెూలీ స్పిరిట్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రాజ్ దావె డాక్టర్ డి.కె. బారువా, అపోలో హాస్పిటల్ డైరెక్టర్ కార్డియాక్ కాథరైజేషన్ లేబొరెటరీ డాక్టర్ ఎన్.కె. పాణి గ్రాహి, డాక్టర్ డి.ఎం.ఆర్.జె. రాజు మరియు డాక్టర్ ఎ. సురేష్ తదితర గుండె వైద్య నిపుణులు పలు క్లిష్టతరమైన కేసుల గూర్చి చికిత్సలు గూర్చి సవివరంగా వివరించారు. దేశంలోనే మొదటిసారిగా గుండె చికిత్సకై ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ (అక్ట్) అనే సరికొత్త టెక్నాలజీని ఉపయోగించి అపోలో హాస్పిటల్స్ చికిత్సను నిర్వహిస్తుంది.

స్టెంట్‌ను వాడిన తర్వాత ఫలితాలు తెలుసుకోవడంతో ఈ టెక్నాలజీ ఎంతో సహకరిస్తుంది. ఈ వర్క్‌షాప్ ద్వారా పలువురు యువ కార్డియాలజిస్టులు లబ్ధిపొందారు.

# రహానె లేకపోవడంలో కఠిన నిర్ణయమే..!

బెంగళూరు: ఐపీఎల్ అనంతరం టీమ్ ఇండియా.. ఇంగ్లాండ్, ఐర్లాండ్‌తో వన్డే, టీ20 సిరీస్, అఫ్గానిస్థాన్‌తో ఒక టెస్ట్ మ్యాచ్ ఆడనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బీసీసీఐ ఈ సిరీస్‌కు సంబంధించి మంగళవారం జట్టుకు ఎంపికైన ఆటగాళ్ల జాబితాను వెల్లడించింది. ఐపీఎల్‌లో విశేషంగా రాణిస్తున్న అంబటి రాయుడు, కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, సిద్ధార్థ్ కౌల్.. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఇక వచ్చే నెల జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో ఆడనున్న ఏకైక టెస్ట్‌కు అజింక్య రహానె నాయకత్వం వహించనున్నాడు. అయితే రహానెను కేవలం టెస్ట్ మ్యాచ్‌కు పరిమితం చేసి ఇంగ్లాండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు ఎంపిక చేయకపోవడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని భారత మాజీ సారథి సౌరభ్ గంగూలీ పేర్కొన్నాడు. బీసీసీఐ తీసుకున్న నిర్ణయం ఎంతో కఠినమైనదని అభివర్ణించాడు. నేనైతే అంబటి రాయుడు స్థానంలో అజింక్య రహానెను ఇంగ్లాండ్ పర్యటనకు ఎంచుకుంటాను. ఇంగ్లాండ్ పిచ్‌లపై రహానెకు మంచి రికార్డు ఉంది. విదేశీ గడ్డపై అతను ఎప్పుడూ అత్యుత్తమ ఆటగాడే. మరోవైపు ఇదే ఇంగ్లాండ్ సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ ఎంపికను గంగూలీ సమర్థించాడు. ఇక ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నైకు ఆడుతున్న రాయుడు మొత్తం ఆడిన 10మ్యాచ్‌లలో 423పరుగులతో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

మరోవైపు రాజస్థాన్ రాయల్స్ సారథ్యం వహిస్తున్న రహానె ఈ సీజనులో నామమాత్రంగా రాణిస్తున్నాడు.

ఇక అంతర్జాతీయ వన్డేల్లోనూ 90మ్యాచ్‌లాడిన రహానె 35సగటుతో 2962పరుగులు చేశాడు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 Phone : 2564353, Fax : 0891-2569004 e-mail: vijayabhanudaily@gmail.com

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## చివరి దశకు చేరుకున్న జేపి అగ్రహారం సంపద కేంద్రం

రోలుగుంట : మండలంలోని జేపి.అగ్రహారంలో నూతనంగా నిర్మిస్తున్న సంపద కేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. ఉపాధి నిధులు, పంచాయతీ నిధులు రూ.10లక్షలు వెచ్చించి నిర్మిస్తున్నారు. మొత్తం పనులు ఆఖరి దశకు చేరాయి. సంపద కేంద్రాన్ని త్వరలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. సంపద కేంద్రంలో ఉత్పత్తి ప్రారంభమైతే గ్రామంలో చెత్త సమస్య లేకుండా ఉంటుందన్నారు. దీంతో పంచాయతీకి కూడా అదనపు ఆదాయం కూడా లభిస్తుందన్నారు.

## సమస్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

### పార్టీ శిక్షణ శిబిరంలో వైకాపా నేతలు

కర్నూలు : ప్రజా సమస్యలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లా ల్సిన బాధ్యత బూత్‌స్థాయి కమిటీ లేదనని వైకాపా రాజకీయ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని వీజే ఆర్ కన్వెన్షన్ హాలులో వైకాపా నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బూత్‌స్థాయి కమిటీ కన్వీనర్ల శిక్షణ కార్య క్రమం రీజనల్ కోఆర్డినేటర్ మేకపాటి గౌతంరెడ్డి, నంద్యాల పార్లమెంటు నియోజక వర్గ అధ్యక్షులు శిల్పా చక్రపాణి రెడ్డి అధ్యక్షతన జరిగింది. సజ్జల రామకృష్ణారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, శాసనమండలిలో ప్రతిపక్షనేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పాలనలో అవినీతి పెరిగిపోయిందని, ప్రజలెవరూ సంతోషంగా లేరన్నారు. ప్రజా సమస్యలపై మన నాయకుడు వైఎస్ జగన్ చేస్తున్న ప్రజా సంకల్ప యాత్ర సందర్భంగా ఇదే విషయం వెల్లడవుతోందన్నారు. అధికార తెలుగుదేశం పార్టీ అనుసరిస్తున్న విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ బూత్‌స్థాయి కమిటీలు పోరాడాలని పిలుపునిచ్చారు. రాబోవు రోజుల్లో ప్రజలకు అండగా నిలిచి చంద్రబాబు పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశదశ నిర్దేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌరుచరిత, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పార్టీ కర్నూలు పార్లమెంటరీ అధ్యక్షుడు బీవై రామయ్య, నంద్యాల డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సేవలు విస్తృత పరచాలి



కర్నూలు : రెడ్‌క్రాస్ సేవలు ప్రధానంగా గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేవిధంగా విస్త ృత ప్రచారం నిర్వహించాలని జబ్బార్ జిల్లా సమన్వయకర్త హేమలత అన్నారు. రెడ్‌క్రాస్‌కు విస్తృత సేవలు అందించినవారికి ధ్రువపత్రాలు, తలసేమియా బాధిత చిన్నారులకు ఆర్థిక సహాయం అందజేత కార్యక్రమం ఛైర్మన్ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ రక్తదానంపై ప్రధానంగా యువతలో అవగాహన పెంచి అత్యవసర వైద్యం పొందే రోగులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పాఠశాల స్థాయి నుంచే రెడ్‌క్రాస్ సేవలు, రక్తదానంపై విస్త ృత అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా శ్రీమాత మహిళా భక్త బ ృందం ఆధ్వర్యంలో తలసేమియా బాదిత చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున కె.శ్రీదేవి, అరణ ఆధ్వర్యంలో అందించారు. సెట్కూరు మేనేజర్ రాజేంద్ర కుమార్, రెడ్‌క్రాస్ మేనేజర్ నాగ రాజు, రెడ్‌క్రాస్ ట్రెజరర్ రఘునాథరెడ్డి, ఉపాధ్యాయిని రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నీరు-చెట్టు పెండింగ్ నిధులు విడుదల చేయాలి

నెల్లూరు : నెల్లూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు నిధులను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీరు-చెట్టు నిధులకు సంబంధించి కలెక్టరు ముత్యాలరాజు, సదస్సులో ఉన్న రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు స్పందిస్తూ.. ఇప్పటి వరకు రూ. 220 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆయా నిధులకు సంబంధించి పనులు పూర్తయ్యాయని, బిల్లులు చెల్లించాల్సి ఉందని తెలియజేశారు.

## మంత్రి తనయుడు త్రుటిలో తప్పిన ప్రమాదం



నర్సీపట్నం : మాకవరపాలెం మండలం గిడుతూరు ప్రత్యేక హోదా కోసం సైకిల్ యాత్రలో అపశృతి చోటుచేసుకుంది. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, అయ్యన్న యువసేన అధ్యక్షులు చింతకాయల విజయ్‌బాబుకు ప్రమాదం జరిగింది. గిడుతూరు నుంచి సైకిల్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా సైకిల్ అదుపు తప్పడంతో విజయ్‌బాబు కిందపడిపోయారు. దీంతో చేతికి తీవ్రగాయంతో పాటు తలకు గాయమైంది. దీంతో వెంటనే నర్సీపట్నం తరలించి వైద్య చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం విశాఖకు వెళ్లారు. ప్రత్యేక హోదా సాధన కోసం తనదైన శైలిలో మండలాల్లో సైకిల్ యాత్రలు చేస్తున్న విజయ్‌బాబుకు ప్రమాదం జరగడం విచాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరాలకు స్పందన

రావికమతం : వేసవికాల విజ్ఞాన శిబిరాలు వల్ల విద్యార్థులు అధిక సంఖ్యలో పఠనాశక్తిని పెంచుకున్నారని కొత్తకోట శాఖా గ్రంథాలయాధికారి ఆర్.రమణబాబు అన్నారు. ఏప్రిల్ 25 నుండి ప్రారంభమై జూన్ 7వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రం అంతటా ప్రారంభించి పఠనాశక్తిని పెంపొందించి పిల్లలకు ఆటల పాటలు, చిత్రలేఖనం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించుకున్న సందర్భంగా దీనికి సంబంధించిన నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. కాగా రిసోర్స్ పర్శన్స్, టీచర్లు సెలవులకు వెళ్లిపోవడం వలన పూర్తిస్థాయిలో అందుబాటులో లేరన్నారు. కొంత మంది మాత్రమే సహకరిస్తున్నారని తెలిపారు. వేసవితాపాన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలకు మజ్జిగ ప్యాకేట్లు, బిస్కెట్లు, మంచినీరు అందుబాటులో ఉంచామని తెలిపారు.

## కేటగిరి-1 విద్యుత్ కనెక్షన్ల అదనపు లోడుకు 50శాతం రాయితీ




అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : కేటగిరీ వన్ విద్యుత్ కనెక్షన్‌లు గల వినియోగదారులకు తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపిడిసిఎల్) భారీ రాయితీ ప్రకటించిందని డివిజనల్ ఇంజనీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బుధవారం దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వినియోగిస్తున్న లోడ్‌కు అదనంగా విద్యుత్‌ను వినియోగిస్తే కిలోవాట్ ఒక్కంటికి రూ.1,200 డవలప్‌మెంట్ చార్జీలుగా చెల్లించాల్సి ఉంటుం దన్నారు. అయితే మే నెలాఖరులోగా సదరు విని యోగదారులు అదనపులోడ్ వినియోగానికి దర ఖాస్తు చేసుకుంటే 50శాతం డెవలప్‌మెంట్ చార్జీలు అనగా కిలోవాట్ ఒక్కంటికి రూ.600 చెల్లిస్తే సరిపోతుం దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు పి.చెల్లి బాబు (చోడవరం), వేణుగోపాల్(వడ్డాది), అసిస్టెంట్ ఇంజనీర్ పరమేష్, అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ రామునాయుడు, రామరాజు, శ్రీనివాసరావు, రత్నాకర్, రామకృష్ణ, బాబ్జి తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం



అంబేద్కర్‌కు నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

నాతవరం : దళిత సంఘాలు, వైయస్సార్ కాంగ్రెస్, సిపిఐ, ఎస్టేర్ స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో నాతవరం మండంలో నాతవరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ప్రకటించిన రాజధాని అమరావలో 25 ఎకరాలలో 125 అడుగులు అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని దళితులకు హామీ ఇచ్చారన్నారు. కానీ నాలుగు సంవత్సరాలు గడిస్తునప్పటికీ ఇంత వరకు ఎటువంటి స్పందన లేదన్నారు. దీనికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అంబేద్కర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి.అజయ్‌బాబు, వైసిపి ఎస్సీసెల్ అధ్యక్షులు అప్పారావు, వైసిపి మండల కార్యదర్శి బిసిహెచ్.పరదేశి, డిహెచ్‌పిఎస్ అధ్యక్షులు అర్జున్, డిపిఐఎస్ అధ్యక్షులు సామర్ల రామారావు, నాతవరం వైస్ ప్రెసిడెంట్ లంక రాంబాబు, ఎస్తేరు స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని వినతిపత్రం



భీమునిపట్నం : భీమిలి డివిజన్ 17 వ వార్డు పాత బస్సు స్టాండ్, అనకాపల్లి ఎం.పి. అవంతి శ్రీనివాసరావు కార్యాలయం ప్రక్కన 900 గజాలు, సుమారు మూడు కోట్ల రూపాయులు విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు గురయిందని, కబ్జాదారుల నుంచి ప్రభుత్వ స్థలం కాపాడాలని కోరుతూ భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు ఆధ్వర్యంలో భీమిలి జోనల్ కమీషనర్ బి. సన్యాసి నాయుడు కు వినపత్రం అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ నాయ కులు కాసరపు నాగరాజు, పెంటపల్లి యోగీశ్వ ర్రావు, గిడుతూరి శ్రీనివాసరావు, మారోజు సంజీవ్ కుమార్, అప్పికొండ నూకరాజు, కొక్కిరి అప్పన్న, కాగుపాటి శంకర్, గూడపురాజు, శివ, మురళి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్నబీమా పరిహారం పంపిణీ



భీమునిపట్నం : భీమిలి జోన్ పరిది 15 వ వార్డులో ఇటీవల మరణించిన జెర్రి వెంకట లక్ష్మి నామినీ అయిన కుమార్తె ఎర్రం శెట్టి మంజులకు చంద్రన్నభీమా బాండు రూ.35 వేలు భీమిలి డివిజన్ టిడిపి అధ్యక్షులు గంటా నూకరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాసరపు. నాగరాజు,గిడుతూరి. శ్రీనివాసరావు, కొక్కిరి అప్పన్న, దాసరి వెంకటేష్, జన్మభూమి సభ్యులు, భీమా మిత్ర పోతిన.వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్ రుణాలు మంజూరు



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

నర్సీపట్నం : బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా మంజూరు అయిన రుణపత్రాలను నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు బుధవారం పంపిణీ చేశారు. మంజూరైన రుణ మంజూరు పత్రాలను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సన్యాసిపాత్రుడు మాట్లాడుతూ 11 మంది లబ్ధిదారులకు రూ.4.95లక్షల రుణాలు మంజూరయ్యాయని నర్సీపట్నం మండలం నుండి 7, నాతవరం మండలం 3, మాకవరపాలెం మండలం 1 లబ్ధిధారులకు ఈ రుణాలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, బ్రహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## నేడు రేవులకోటలో వైద్య శిబిరం

కొయ్యూరు : మండలంలోని యు.చీడిపాలెం శివారు రేవులకోటలో ఈ నెల 10న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు మంప ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. విశాఖపట్నంకు చెందిన ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రుల వైద్య నిపుణులు ఈ శిబిరానికి రానున్నట్లు చెప్పారు. అలాగే అదే రోజు వాలీ బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాలీబాల్ జట్లు తమ పేర్లు 9440904218, 9440 904217 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## పోలవరం నిర్మాణ పనులు పరిశీలన



పోలవరంలో జరుగుతున్న నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

గొలుగొండ : పోలవరం నిర్మాణ పనులు పరిశీలనకు మండలంలో గల నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రజాప్రతినిధులను ఇరిగేషన్‌శాఖ ఆధ్వ ర్యంలో తీసుకువెళ్లడం జరిగింది. మండలంలో గల నీటి సంఘాల ప్రతినిధులకు పోలవరం కాలువల నిర్మాణంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందని గొలుగొండ మండల ఇరిగేషన్ ఏఈఈ రుత్తల రామన్నపాత్రుడు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నుండి సాగునీరు అందే విధానాన్ని ప్రతినిధులకు వివరించామన్నారు. నీటి వినియోగం పొదుపు పై అవగాహన కల్పించామన్నారు. ఈ కార్య క్రమంలో జెడ్పీటీసీ చిటికెల తారక వేణుగోపాల్, పలు నీటిసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరాధ్య నాయకుడు ఎమ్మెల్యే గణబాబు

### -మజ్జి మాలినాయుడు



గాజువాక: నిత్యం ప్రజలతో మమేకమై, ప్రజా సమస్య లను పరిష్కరించి, నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజల ఆరాధ్య నాయకుడు ఎమ్మెల్యే గణబాబు అని జీవీయంసీ 49వ వార్డు తెదేపా ఉపాధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామిక వ్యక్తి మజ్జిమాలినాయుడు పేర్కొన్నారు. బుధవారం పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే, ప్రభుత్వ విఫ్ పెతకం శెట్టి గణబాబు జన్మదినం సంధర్భంగా మజ్జి మాలి నాయుడు ఎఎస్ఆర్ కాలనీ అధ్యక్షులు కరణం గంగా ధర్, గుడివాడఅప్పన్నకాలనీ అధ్యక్షులు మజ్జిజగదీష్, దుర్గానగర్ యూత్ గణేశ్ ప్రెఢ్స్ లు ఎమ్మెల్యే గణబాబును కలిసి పుష్పగుఛ్ఛానిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాలినాయుడు మాట్లాడుతూ నిరంతరం రాజకీయంలో ఉంటూ ప్రజాసేవకే మొదటి ప్రాధాన్యత నిస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని గణ బాబు నిలుపుకోవడం హర్షనీయమని అన్నారు. ఆయన మరిన్ని పుట్టిన రోజువేడుకలు జరుపుకోవాలని, మరిన్ని ఉన్నత పదవులు పొందాలని, నిండూ నూరేళ్ళు ఆయువు ఆరోగ్యాలతో జవీంచేందుకు భగవంతుడు ఆయనకు శక్తిని ప్రసాదించాలని కోరారు.

## గూగుల్ సర్వీసులతో వోల్వో కార్లు

విశాఖపట్నం: వోల్వో కారుల్లోకి గూగుల్ సర్వీసులను తీసుకు రావడమనేది మేము అభివృద్ధి చేసిన అప్లికేషన్లకు మంచి బలాన్నిచ్చిందని వోల్వో కార్ల రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ సీనియర్ ఉపాధ్యక్షుడు హెన్రిక్ గ్రీన్ అన్నారు. గూగుల్ మ్యాప్ ట్రాఫిక్ డేటాను అందించనుందని పేర్కొన్నారు. దూరంలో ఉన్న ట్రాఫిక్ పరిస్థితిని డ్రైవర్లకు అందించి ప్రత్యామ్నాయ మార్గాలను సూచించునని తెలిపారు.

EDUCATION
డిగ్రీ రెగ్యులర్ లేదా డిస్టెన్స్‌లో చదివి డిస్కంటిన్యూ అయిన వారికి ఒకే సంవత్సరంలో డిగ్రీ పూర్తి.
AU డిస్టెన్స్ (పాస్ గ్యారంటీ కోచింగ్/గైడెన్స్)
BA/B.Com/B.Sc/MA/M.Com/M.Sc., Diploma/B.Tech/10th/Inter
98487 21118
99850 71118